

నేడు సీఎం జగన్ రాక

అనకాపల్లి జిల్లాలో 'చేయూత' కార్యక్రమం



అనకాపల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం అనకాపల్లి రానున్నారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి ఉదయం 10.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు కశింకోట ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు ... మిగతా 6వ పేజీలో

బీసీలకు భరోసా!

తెలుగుదేశం-జనసేన ప్రకటించిన డిక్లరేషన్‌పై బీసీ వర్గీయుల్లో హర్షం

- వెనుకబడిన తరగతుల ఆర్థిక అభ్యున్నతికి దోహదం
- 50 ఏళ్లకే పింఛన్...నెలకు రూ.4,000
- బీసీల హక్కుల రక్షణకు ప్రత్యేక చట్టం
- స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ
- బీసీల సబ్‌ప్లాన్‌కు ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లు..
- ఆర్థికాభివృద్ధి, ఉపాధికి ప్రోత్సాహకాల పునరుద్ధరణ
- చట్టబద్ధంగా కులగణన
- శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తాం
- రూ.10 లక్షలతో చంద్రన్న బీమా పునరుద్ధరణ... పెళ్లి కానుక రూ.లక్షకు పెంపు
- బీసీలకు ప్రత్యేక భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం
- షరతులు లేకుండా విదేశీ విద్య అమలు
- పీజీ విద్యార్థులకు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరణ
- ఆదరణ పథకం పునఃప్రారంభం



బీసీ డిక్లరేషన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఇరు పార్టీల నేతలు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తమ అభివృద్ధి, సంక్షేమం కోసం తెలుగుదేశం, జనసేన కూటమి మంగళవారం ప్రకటించిన డిక్లరేషన్‌పై బీసీ వర్గీయుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఎస్సీ, ఎస్టీ వర్గాల రక్షణకు రాజ్యాంగం ప్రత్యేక చట్టం రూపొందించింది. అటువంటి చట్టం కావాలని చాలాకాలంగా బీసీ వర్గాలు కోరుతున్నాయి. ఇందుకు టీడీపీ కూటమి ముందుకురావడం హర్షించదగిన విషయమని రాజగోపాల్ అనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అన్నారు. ఈ చట్టం అమలులోకి వస్తే బీసీలకు ప్రత్యేక రక్షణ లభిస్తుందన్నారు. ఎవరికైనా నష్టం జరిగినా, దోపిడీకి గురైనా, చివరకు ప్రభుత్వం నుంచి రావల్సిన సాయం అందకపోయినా న్యాయపోరాటం చేయవచ్చు నని వ్యాఖ్యానించారు. అలాగే ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో అనేకమంది గ్రామ/మండల/జిల్లా స్థాయిల్లో పదవులు పొందారని, ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం దానిని తగ్గించడంతో చాలా నష్టం జరిగిందని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచార్య పూర్ణచంద్రరావు ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో పొందిన 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని టీడీపీ కూటమి ... మిగతా 6వ పేజీలో

బీసీ డిక్లరేషన్‌పై మరిన్ని అభిప్రాయాలు ..Iవ పేజీలో

ప్రత్యేక చట్టంతో బీసీలకు రక్షణ



వెనుకబడిన వర్గాల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలన్న ప్రతిపాదన మంచి ఫలితం ఇస్తుంది. సమాజంలో ఆయా వర్గాల అభ్యున్నతి, రక్షణ, హక్కులకు నిధులు కేటాయిస్తామని చెప్పడం వేరు...వాటి అమలుకు చట్టం చేయడం వేరు. దీనివల్ల ప్రభుత్వం మాట తప్పినా, మరే కారణాల వల్ల అమలు వాయిదా వేస్తున్నా సంబంధిత వర్గానికి చెందిన వ్యక్తులు న్యాయపోరాటం చేసి సాధించుకునే వీలుంటుంది. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ, సబ్‌ప్లాన్ కింద నిధుల కేటాయింపు, 50 ఏళ్లకు పింఛన్ వంటివన్నీ స్వాగతించదగ్గవి. అయితే అట్టడుగున ఉన్న అర్హులకు అందాలి. బీసీలకు శాశ్వత ప్రాతిపదికగా కుల ధ్రువీకరణ పత్రం జారీ వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుంది. ముఖ్యంగా పిల్లలు కొత్త ప్రదేశంలో చదువుల కోసం వెళ్లినప్పుడు ఇబ్బందులు ఉండవు.

- ఆచార్య ఎం.పూర్ణచంద్రరావు, ఏపీ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు

బీసీల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదం



తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమి ప్రకటించిన బీసీ డిక్లరేషన్ బీసీలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించేందుకు దోహదం చేస్తుంది. బీసీలకు 50 ఏళ్లకే నాలుగు వేల రూపాయల పెన్షన్ ఇవ్వడం వల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడే ఎంతోమందికి ఆసరా లభిస్తుంది. బీసీ రక్షణకు ప్రత్యేక చట్టాన్ని చేయాలనుకోవడం గొప్ప విషయం. గత కొన్నాళ్లుగా బీసీలుపై దాడులు పెరుగుతున్నాయి. ఈ తరహా దాడులు నుంచి రక్షణకు అవకాశం కలుగుతుంది. సబ్ ప్లాన్‌కు లక్షన్నర కోట్ల రూపాయలు కేటాయింపు అంటే గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీల సమగ్ర ఆర్థిక అభివృద్ధికి బాటలు పడే అవకాశముంటుంది. ప్రోత్సాహకాల పునరుద్ధరణ వల్ల స్వయం ఉపాధి మార్గాల బాట పట్టేందుకు బీసీ యువతకు అవకాశం ఏర్పడుతుంది.

- వి.సంగంనాయుడు, విశాఖపట్నం



ఆనందపురం తర్లువాడలో కొండ తవ్వకం

వైసీపీ నేతల గ్రావెల్ దందా

దర్జాగా యంత్రాలతో కొండలు తవ్వేస్తున్నారు

- తర్లువాడలో వందల లారీల గ్రావెల్ తరలింపు
- మొద్దునిద్రలో రెవెన్యూ సిబ్బంది
- దాడులకు గనుల శాఖ వెనుకంజ
- పెందుర్తి మండలంలో కూడా అదే పరిస్థితి

విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఆనందపురం, పెందుర్తి మండలాల్లో జగనన్న కాలనీల కోసమంటూ అధికార పార్టీ నేతలు కొండలను తవ్వేస్తున్నారు. ఆనందపురం మండలం తర్లువాడలో మూడు రోజుల క్రితం కొండ నుంచి వందల లారీల గ్రావెల్ తవ్వి విక్రయించుకున్నారు. మండల స్థాయి వైసీపీ నాయకుడు ఒకరు ఈ దందాకు నాయకత్వం వహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడు రోజులపాటు పగలు, రాత్రి మూడు భారీ ఎస్కవేటర్లు పెట్టి మరీ సర్వే నంబరు 162లో గల కొండకు తవ్వేశారు. సాధారణంగా కొండవాలు ప్రాంతంలో తవ్వకాలు చేస్తుంటారు. అటువంటిది కొండ శిఖరం నుంచి కింద వరకూ మొత్తం తవ్వేసి లారీల్లో తరలించేశారు. స్థానికుల అంచనా ప్రకారం సుమారు కోటిన్నర నుంచి రెండు కోట్ల రూపాయల విలువైన గ్రావెల్ అమ్ముకున్నారు. ఇందుకు సంబంధించి వచ్చిన ఫిర్యాదు మేరకు గనుల శాఖ అధికారులు దాడులకు వెళితే తొలుత బెదిరించారు. తరువాత జగనన్న కాలనీలకే తరలిస్తున్నామని బుకాయించారు. హౌసింగ్ అధికారుల నుంచి ఫోన్‌లు చేయించారు. అయినా గనుల శాఖ సిబ్బంది వదలకుండా 100 క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అనుమతి లేకుండా తవ్వారని నిర్ధారించి సుమారు రూ.ఆరు లక్షల జరిమానా విధించారు. అయితే జరిమానా రద్దు చేయాల్సిందిగా వైసీపీ కీలక నేతల నుంచి గనుల శాఖపై ఒత్తిడి వస్తోంది. తర్లువాడ కొండను తవ్వుతున్నారని గ్రామస్థులు కొందరు తహసీల్దారు కార్యాలయానికి సమాచారం ఇస్తే కనీసం అటువైపు కన్నెత్తి చూడలేదు. తాము చాలా బిజీగా ఉన్నామంటూ తప్పించుకున్నారు. ఇంకా ఆనందపురం తహసీల్దారు కార్యాలయానికి కూతవేటు దూరంలో కొండ నుంచి భారీగా గ్రావెల్ తవ్వేశారు. కణమాం, గిడిజాల ... మిగతా 6వ పేజీలో

తిరుమల, షిర్డీ రైళ్లు ఫుల్



- వేసవి సెలవుల నేపథ్యంలో మే 29 వరకూ తిరుమల ఎక్స్‌ప్రెస్, జూన్ 20 వరకు షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లలో బెర్తులు కష్టమే
- ముందే రిజర్వేషన్
- తిరుపతి మీదుగా నడిచే వారాంతపు రైళ్లకు డిమాండ్
- మన్మాడ్ వెళ్లే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కూ...

విశాఖపట్నం, మార్చి 6:

వేసవిలో తిరుపతి, షిర్డీ రైళ్లకు విపరీతమైన డిమాండ్ కనిపిస్తోంది. తిరుమల ఎక్స్‌ప్రెస్ (17488)లో మే నెలాఖరు వరకు, షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503)లో జూన్ 20వ తేదీ వరకూ బెర్తులు అయిపోయాయి. ఉత్తరాంధ్ర నుంచి కుటుంబ సమేతంగా తిరుపతి, షిర్డీ వెళ్లదలచుకున్నవారు సాధారణంగా ప్రతిరోజు అందుబాటులో ఉండే తిరుమల ఎక్స్‌ప్రెస్‌ను, వారానికి ఒకరోజు (గురువారం) నడిచే షిర్డీ ఎక్స్‌ప్రెస్‌ను ఆశ్రయిస్తారు. నాలుగు నెలల ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని ఉపయోగించుకుని బెర్తులు ఖరారు చేసుకుంటారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ పరిస్థితి

విశాఖ నుంచి బయలుదేరే తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో (17488) మే నెలాఖరు వరకు బెర్తులు రిజర్వు అయిపోయాయి. కొన్ని తేదీల్లో ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ కోచ్‌లలో నాలుగైదు బెర్తులు అందుబాటులో ఉన్నాయి. స్లీపర్, థర్డ్ ఏసీ కోచ్‌లలో బెర్తులు నిండిపోయాయి. కాగా వారానికి ఒకరోజు (సోమవారం) అందుబాటులో ఉన్న విశాఖ-తిరుపతి ప్రత్యేక రైలుకు (08583) మార్చి 25వ తేదీ వరకు బెర్తులు లభిస్తున్నాయి. అయితే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈ ప్రత్యేక రైలును కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. ఇక ప్రతి సోమ, గురు, శనివారాల్లో అందుబాటులో ఉన్న డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ (22707)లో సీట్లు లభిస్తున్నాయి. అలాగే, పూరి-తిరుపతి (17479) ఎక్స్‌ప్రెస్‌కు కూడా బెర్తులు అందుబాటులో ఉన్నాయి. తిరుపతి, రేణిగుంట మీదుగా వెళ్లే దూరప్రాంత వారాంతపు రైళ్లయిన వివేక్ ఎక్స్‌ప్రెస్ (22504), హటియా-బెంగళూరు (12835), పూరి-చెన్నై (22859), హౌరా-పాండిచ్చేరి (12867), గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12660), అంగా ఎక్స్‌ప్రెస్ (12254)లకు వేసవి తాకిడి ఎక్కువగానే ఉంది. తిరుపతి మీదుగా నడిచే కొల్లాం (కేరళ), చెన్నై రైళ్లకూ ఇదే పరిస్థితి.

షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లో నిండిన బెర్తులు

ప్రతి గురువారం విశాఖ నుంచి షిర్డీ వెళ్లే ఎక్స్‌ప్రెస్ (18503)లో జూన్ 20వ తేదీ వరకు బెర్తులు నిండిపోయాయి. వారానికి ఒకరోజు మాత్రమే అందుబాటులో ఉండే ఈ రైలుకు ... మిగతా 6వ పేజీలో

రూ.54.4 కోట్లతో సింహగిరి అభివృద్ధి

'ప్రసాద్' పథకం కింద నిధులు మంజూరు

- నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ

సింహాచలం, మార్చి 6: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి 'ప్రసాద్' (పిలిగ్రిమేజ్ రిజువినేషన్ అండ్ స్పిరిట్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్) అనే పథకానికి రూపకల్పన చేసింది. అందులో భాగంగానే సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పరిధిలో రూ.54.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 2022 సెప్టెంబరులో డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) సమర్పించగా ఆమోదం తెలిపింది. నాటి నుంచి అనేక చర్చోపచర్చల తరువాత ఎట్టకేలకు గురువారం మధ్యాహ్నం 11.45 గంటలకు శ్రీనగర్ నుంచి ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో దేశవ్యాప్తంగా 'ప్రసాద్' పనులకు లాంఛనంగా శంకుస్థాపన చేయనున్నారు.

డీపీఆర్ ప్రకారం 'ప్రసాద్' పథకం కింద భక్తులకు వసతి కల్పన, క్యూల నిర్మాణం చేపట్టనున్నారు. కొండ దిగువన నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన పుష్కరిణి సత్రం స్థానంలో రూ.4.78 కోట్ల వ్యయంతో వసతి కేంద్రాలను నిర్మించనున్నారు. రెండో ఘాట్‌రోడ్డు వద్ద సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రూ.5.4 కోట్ల వ్యయంతో కనీస వసతుల యాత్రిక్ సదన్, పాత ఘాట్‌రోడ్డు ప్రవేశం వద్ద సుమారు రూ.3.54 కోట్లతో వ్యూపాయింట్లు, కొండపై దేవాలయానికి సంబంధించి విశేషాల ప్రదర్శన, మెట్లమార్గం ఆధునికీకరణ వంటి పనులు చేపట్టనున్నారు. అదేవిధంగా సుమారు రూ.7.7 కోట్లతో వంటశాల యాంత్రీకరణ, తాగునీటి కేంద్రాలు, గంగధార వద్ద దుస్తులు మార్చుకునేందుకు గదులు, 500 మంది కూర్చునేందుకు వీలుగా యాంపీ థియేటర్, ఎలక్ట్రికల్ చార్జింగ్ కేంద్రాల ఏర్పాటు చేయనున్నారు. రూ.3.46 కోట్లతో పర్యాటక సమాచార కేంద్రం విత్ ఫుడ్ కౌంటర్, సోలార్ పవర్ ప్లాంట్, రూ.11.68 కోట్లతో దర్శన్ వెయిటింగ్ హాల్, హిల్‌టాప్ రోడ్డులో టీవీ టవర్ సమీపాన సుమారు రూ.4 కోట్లతో మల్టీపర్పస్ జీ+1 హాల్స్, రూ.5.62 కోట్లతో పక్కా మల్టీ లెవెల్ షాపింగ్ ... మిగతా 6వ పేజీలో



ఫీజు పరేషాన్

2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి తొలి విడత జగనన్న విద్యాదీవెన నిధులు ఈ నెల ఒకటో తేదీన విడుదల



- మిగిలిన మూడు విడతల చెల్లింపుపై స్పష్టత కరువు
- ఇంజనీరింగ్ ఫైనలియర్ విద్యార్థులకు మరో రెండు నెలల్లో ముగియనున్న కోర్సు
- పెండింగ్ మూడు విడతలు చెల్లించాల్సిందిగా వారిపై కళాశాలల యాజమాన్యాల ఒత్తిడి
- ఫీజు చెల్లిస్తేనే హాల్ టికెట్లు ఇస్తామంటున్న కొన్ని కాలేజీలు
- విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన

విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): 'జగనన్న విద్యా దీవెన' నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం సీఎం బటన్ నొక్కకపోవడంతో ఫీజుల భారం విద్యార్థులపై పడుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు షెడ్యూల్ ప్రకారం ఇప్పటికే మూడు విడతలు విద్యా దీవెన చెల్లించాలి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీన 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన తొలి విడత సొమ్మును విడు దల చేసింది. ఇప్పుడు సమస్య ఏమిటంటే...ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులు మరో రెండు, మూడు నెలల్లో రిలీవ్ అవుతారు. వారందరినీ మిగిలిన మూడు విడతల ఫీజును చెల్లించాల్సిందిగా కాలేజీ యాజమాన్యాలు కోరుతున్నాయి. ప్రభుత్వం చెల్లించకుండా తామెక్కడి నుంచి తీసుకువస్తామని విద్యార్థులు అడుగుతున్నా...యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నేరుగా విద్యార్థి, తల్లి జాయింట్ ఖాతాలోనే జమ చేస్తున్నందున, ఎప్పటికైనా ఆ డబ్బులు వస్తాయని కాబట్టి ముందు ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం గతంలో మాదిరిగా నేరుగా కాలేజీలకు ఫీజులు చెల్లించే విధానం ఉంటే ఈ ఇబ్బందులు ఉండేవి కావని విద్యార్థులు వాపోతున్నారు.

తొలివిడత మాత్రమే విడుదల

'విద్యా దీవెన' కింద ఏటా నాలుగు విడతల్లో ఫీజులు చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు మూడు నెలలకు ఒకసారి (క్వార్టర్) ఫీజులు విడుదల చేయాలి. కానీ, పథకం ప్రారంభించిన రెండో ఏడాది నుంచే నిధుల విడుదల ప్రక్రియ గాడి తప్పింది. మూడు నెలలకు ఒకసారి విడుదల చేయాల్సిన ఫీజులు ఆరు నెలలకు, ఎనిమిది నెలలకు ఒకసారి విడుదల చేస్తోంది. తాజాగా, ఈ నెల ఒకటో తేదీన సీఎం జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి 2023-24 విద్యా సంవత్సరం మొదటి త్రైమాసికానికి సంబంధించిన ఫీజులను విడుదల చేశారు. మిగిలిన మూడు క్వార్టర్ల ఫీజు విడుదలపై స్పష్టత లేదు. మరో వారం, పది రోజుల్లో ఎన్నికల షెడ్యూల్ విడుదల కానున్న నేపథ్యంలో ప్రభుత్వం విద్యా దీవెన విడుదల చేసే పరిస్థితి లేదని భావిస్తున్న కళాశాలల యాజమాన్యాలు...మొత్తం ఫీజును చెల్లించాల్సిందిగా విద్యా ర్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. ఫీజు చెల్లించిన విద్యార్థులను మాత్రమే పరీక్షలకు, అంతకంటే ముందు నిర్వహించే ప్రాజెక్టు రివ్యూలకు అనుమతిస్తామని స్పష్టం చేస్తున్నాయి.

పది వేల మందికిపైగా విద్యార్థులు..

ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థుల సంఖ్య ... మిగతా 6వ పేజీలో

కత్తులతో వీరంగం

... వార్త 6వ పేజీలో



భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీపీ-1 మణికంఠచందోలు

భూకబ్జాలపై 191 ఫిర్యాదులు

పూర్తిస్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తాం

- దోషులపై చర్యలు తీసుకుంటాం
- పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్

విశాఖపట్నం, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): భూకబ్జాలకు సంబంధించి నగరంలోని స్టేషన్లలో బుధవారం నిర్వహించిన 'ప్రత్యేక స్పందన'కు 191 ఫిర్యాదులు అందినట్టు పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. ప్రతి స్టేషన్‌లో ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఏసీపీ అంతకంటే పైస్థాయి అధికారులు ప్రత్యక్షంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారన్నారు. ఫిర్యాదులను ఒక్కొక్కటిగా పరిశీలించి కేటగిరీ వారీగా విభజించిన తర్వాత చర్యలు ప్రారంభిస్తామన్నారు. ఒకే భూమిని ఒకరికంటే ఎక్కువ మందికి విక్రయించడం, సరిహద్దుల వివాదాలు, తప్పుడు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదంలో ఉన్నవి, ఇంజక్షన్ ఆర్డర్స్ ఉన్నవి, భూ ఆక్రమణలు, ఇనాం భూములు, నకిలీ డాక్యుమెంట్లు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయడంతోపాటు దోషులకు చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే కబ్జాదారులు, నకిలీ డాక్యుమెంట్లు తయారుచేసినవారు, వారికి సహకరించిన ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులపై కేసులు నమోదుచేసి పీడీ యాక్ట్, నగర బహిష్కరణ వంటి శిక్షలు అమలు చేస్తామన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ..

పూర్ణామార్కెట్, మార్చి 6: గ్రేటర్ 35 వార్డు పూర్ణామార్కెట్, దుర్గాలమ్మ గుడి ప్రాంత బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ బుధవారం పర్యటించారు. బుధవారం వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుతో కలసి దుర్గాలమ్మగుడి పరిసర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి మహిళలను కలసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదుల స్వీకరణ

సీతంపేట, మార్చి 6: భూ కబ్జాలు, ఆక్రమణలకు సంబంధించి ఫిర్యాదులను బుధవారం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏసీపీ బి.మెహర్ జయరాం ప్రసాద్ స్వీకరించారు. లలితా నగర్‌కి చెందిన తమ ఇంటిని ఆక్రమించారని బాధితురాలు రాజ్యలక్ష్మి ఫిర్యాదు చేశారు. తన భర్త మద్ది శ్రీనివాసరెడ్డి అలియాస్ వాసుకి చెందిన సొంత బంధువులే మోసం చేశారని, దీంతో మనోవేదనతో శ్రీనివాసరెడ్డి కొద్ది కాలం క్రితం గెండెనొప్పితో మృతి చెందారని, న్యా యం చేయాలని రాజ్యలక్ష్మి కోరారు. అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌కి చెందిన సూరిశెట్టి హేమాంగిణి తన భర్త వెంకటరామ్‌కుమార్‌కి తండ్రి నుంచి వచ్చిన అక్కయ్యపాలెం రామచంద్రనగర్‌లో గల స్థలాన్ని బంధువులైన సూరిశెట్టి నరసింహమూర్తి, గౌరి శంకర్‌లు తప్పుడు పత్రాలతో తమ స్థలం కబ్జాకు చేయడానికి చూస్తున్నారని తెలిపారు. ద్వారకా పోలీసు స్టేషన్‌లో ఏడీసీపీ ఎంఆర్‌కె రాజు ఆధ్వర్యంలో సీఐ రమేష్ బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. నక్కవానిపాలెంలో ఏడుగుళ్ల స్థలం గురవుతుందని గ్రామ కమిటీ పెద్దలు ఫిర్యాదు ఇచ్చారు. సీఐ సీఐ విజయ్‌కుమార్‌కి, ఎస్ఐ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ కూడలి: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భూకబ్జాలు, ఆక్రమణలపై బుధవారం నగర ఏసీపీ ట్రాఫిక్ 2 జి. రాజీవ్‌కుమార్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆనందపురం వద్దనున్న తన 300 గజాల స్థలం ఆక్రమణకు గురైనట్టు పాతనగరంలో నివాసముంటున్న బాధితుడు ఫిర్యాదు అందజేశారు. నగర పోలీస్ కమిషనరేట్‌కు వచ్చిన ఫిర్యాదులను అందజేస్తామని పోలీసులు తెలిపారు.



వన్‌టౌన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏసీపీ రాజీవ్‌కుమార్



నాలుగో టౌన్ స్టేషన్‌లో ఏసీపీ మెహర్ జయరాం ప్రసాద్

విమ్స్‌లో ఉత్తమ వైద్య సేవలు : కలెక్టర్



గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ, మార్చి 6: ఉత్తరాంధ్ర వాసులకు విమ్స్ ఒక వరమని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అన్నారు. ఆస్పత్రిలో రూ.2కోట్లతో ఏర్పాటు చేసిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండేళ్లుగా విమ్స్ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నామన్నారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ కె.రాంబాబు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఈడీ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం

వెంకోజీపాలెం, మార్చి 6: నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన స్థాయీ సంఘం సమావేశంలో ఆమె మాట్లాడుతూ 68 అజెండా అంశాలతో పాటు 28 టేబుల్ అజెండా అంశాలను సభ్యులు చర్చ లేకుండానే ఆమోదించారన్నారు. రెవెన్యూ విభాగానికి చెందిన లీజుల పొడిగింపు, ఆశీలు వసూలు, ప్రజారోగ్య విభాగానికి పలు వార్డుల్లో తాత్కాలిక పద్ధతిపై అదనపు పారిశుధ్య కార్మికుల నియామకం, జేసీబీలతో వ్యర్థాల తొలగింపు, వెటర్నరీ విభాగానికి మందుల కొనుగోలు, తదితర అంశాలకు ఆమోదం లభించిందన్నారు.

ఎర్నిమాంబ ఆలయ ట్రస్ట్ ప్రమాణ స్వీకారం

జ్ఞానాపురం, మార్చి 6: ఎన్నో ఏళ్లుగా వివాదాలతో జాప్యమవుతు వస్తున్న జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయం ట్రస్ట్ సభ్యుల ప్రమాణ స్వీకారం ఎట్టకేలకు బుధవారం జరిగింది. కోర్టులో వివాదం పరిష్కారం కావడంతో ఈ ప్రమాణం స్వీకారం ఏర్పాటు చేసినట్టు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరిష తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ కుమార్, కార్పొరేటర్ తోటపద్మావతి హజరయ్యారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్‌గా లండారమణ, సభ్యులుగా చుక్కాశ్యామ్‌సుందర్ రెడ్డి, కోశెట్టి దేవి, యలమశెట్టి లక్ష్మి, కర్రి ధనయమ్మ, కుంచపు ఆదినారాయణ,వాసుపల్లి నారాయణరావు,కణికి గౌరి, కె. తేజారత్నం ఎన్నికయ్యారు. ఆలయ ఈవో సురేష్‌బాబాలింగం శ్రీను ఉన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

రైల్వేలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాఖపట్నం, మార్చి 6: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా వాల్తేరు రైల్వేలో బుధవారం మహిళా సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా సాధికారతకు వాల్తేరు రైల్వే ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. అనంతరం ఆర్పీఎఫ్, కమర్షియల్, ఆపరేటింగ్, ఇంజనీరింగ్, మెడికల్ శాఖలలో ఫ్రంట్‌లైన్ ఉద్యోగులుగా సేవలందిస్తున్న 24 మంది మహిళలకు మెరిట్ సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేసి అభినందించారు. లా కాలేజీ ఆఫ్ ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం ప్రత్యేక అతిథి హాజరై జెండర్ సెన్సిటైజేషన్‌పై ప్రసంగించి అవగాహన కల్పించారు. ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, పాల్గొన్నారు.

'టీడీపీ నేత గోగినేని మృతి తీరని లోటు

అక్కయ్యపాలెం, మార్చి 6: ఎన్టీఆర్ సంక్షేమ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు, టీడీపీ మాజీ కార్పొరేటర్ గోగినేని సాంబశివరావు మృతి పార్టీకే తీరని లోటని ఎంవీఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత ఎం.వెంకటరావు, లీడర్ పత్రిక అధినేత విల్లూరి వెంకటరమణమూర్తి అన్నారు. ఎన్టీఆర్ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సుబ్బలక్ష్మీనగర్‌లోని సుబ్బలక్ష్మీ కల్యాణమండపంలో సాంబశివరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దువ్వి కాశీప్రసాద్, కన్నం వెంకటరమణారావు, ఎం. శ్రీకృష్ణ, జేకే, ఎంఎల్ఎన్ రావు, తోట శ్రీదేవి, శ్రీవేణి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సీఎం పర్యటనతో హైవే బంద్

» లంకెలపాలెం, పరవాడ, అచ్యుతాపురం, ఎలమంచిలి మీదుగా ట్రాఫిక్ మళ్లింపు

అనకాపల్లి రూరల్, మార్చి 6: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురువారం అనకాపల్లి జిల్లా పర్యటన సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా భారీ వాహనాల ను దారి మళ్లిస్తున్నట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. చేయూత పథకం నిధులు విడుదల చేసేందుకు పిసినికాడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యే అవకాశం ఉన్నందున ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. విశాఖ నుంచి అనకాపల్లి మీదుగా వెళ్లే వాహనాలు లంకెలపాలెం జంక్షన్ నుంచి పరవాడ, అచ్యుతాపురం, ఎలమంచిలి, రేగుపాలెం జంక్షన్ మీదుగా వెళ్లాలన్నారు. తుని నుంచి అనకాపల్లి మీదుగా విశాఖ వైపు వెళ్లే భారీ వాహనాలు రేగుపాలెం జంక్షన్ నుంచి ఎలమంచిలి, అచ్యుతాపురం, పరవాడ మీదుగా లంకెలపాలెం జంక్షన్‌కు చేరుకోవాల న్నారు. శ్రీకాకుళం వైపు నుంచి ఆనందపురం- అనకాపల్లి నాలుగు వరుసల జాతీయ రహదారి మీదుగా వచ్చే వాహనాలు సబ్బవరం వద్ద సర్వీసు రోడ్డులోకి మారి, అనకపల్లి, లంకెలపాలెం జంక్షన్, పరవాడ, అచ్యుతాపురం ఎలమంచిలి మీదుగా రేగుపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకుని తుని వైపు వెళ్లవచ్చునన్నారు. చోడవరం నుంచి తుని వైపు వెళ్లే వాహనాలు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, మునగపాక, అచ్యుతాపురం జంక్షన్, ఎలమంచిలి మీదుగా రేగుపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకుని తుని వెళ్లాలన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

సీతమ్మధార, మార్చి 6: గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి పైల శేఖర్‌బాబు ఆధ్వర్యంలో ఆర్చకులు రామారావు శర్మ, మహేశ్ శర్మలు ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు. మూల విరాట్ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, మేళాతాళలతో స్వా మి, అమ్మవార్లను పల్లకిపై తీరువీధుల్లో ఊరే గించారు. సాయంత్రం ఆలయ శివపార్వతుల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ నక్కా అప్పలరెడ్డి, ధర్మకర్తలు జాన్, నక్కా జ్యోతి, నాగమణి పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో పార్వతీపరమేశ్వరులు

తక్షణమే జేటీఓ పరీక్షలను నిర్వహించాలి..

డాబాగార్డెన్స్, మార్చి 6: పంజాబ్ సర్కిల్‌లోని మూడు జేటీఓ ఎల్ఐసీఈ పరీక్షలు రద్దు చేయడం అన్యాయమని బీఎస్ఎన్ఎల్ ఈయూ సభ్యులు అన్నారు.ఈ మేరకు డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ఆవరణలో బుధవారం మధ్యాహ్నం లంచ్ అవర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2015 నుంచి 2018 వరకు సంబంధించిన ఖాళీలకు చాలా ఏళ్ల తర్వాత పంజాబ్ సర్కిల్‌లో మూడు జేటీఓ ఎల్ఐసీఈ పరీక్షలు చేశారన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు సాగర్, తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో గుండెపోటుతో విశాఖ భక్తుడి మృతి

ఐరాల(కాణిపాకం), మార్చి 6: చిత్తూరు జిల్లా కాణిపాకంలో వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకుని బయటకు వచ్చిన ఒక భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. విశాఖపట్టణానికి చెందిన నాగబాబు(58) బుధవారం ఉదయం 9గంటలకు కుటుంబ సభ్యులతో కలసి వరసిద్ధుడిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసాదాలు కొనుగోలు చేయడానికి ఆలయం వెనుక వైపున్న లడ్డూ ప్రసాదాల కౌంటర్ వద్దకు చేరుకున్నారు. అక్కడే కుప్పకూలిపోవడంతో నాగబాబును చిగరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు.

ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు అభినందన

కంచరపాలెం, మార్చి 6 : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి అభినందించారు. కళాశాలను ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆదిత్య బిర్లా గ్రూప్‌లో ఇటీవల ఉద్యోగాలు పొందిన నలుగురు విద్యార్థినులకు నియామకపత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సాంకేతిక విద్య డీడీ డా. ఎం.ఎ.వి. రామకృష్ణ, ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ,డా. బి.వి. లక్ష్మణరావు పాల్గొన్నారు

వీఎంఆర్‌డీఏ అభివృద్ధికి కృషి : చైర్మన్

సిరిపురం, మార్చి 6 : వీఎంఆర్‌డీఏ అభివృద్ధికి కృషి చేస్తానని ఆ సంస్థ చైర్మన్ సనపాల చంద్రమౌళి పేర్కొన్నారు. బుధవారం ఆయన వీఎంఆర్‌డీఏ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సంస్థపై తనకు పూర్తి అవగాహన ఉందని, సిబ్బంది సమయపాలన, అంకితభావంతో పనిచేస్తూ సహాయ సహకారాలు అందిస్తే సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చేలా కృషి చేస్తానన్నారు. ఆయనతో పాటు జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, చీఫ్ ఇంజనీర్ భవానీ శంకర్, చీఫ్‌ప్రణాళికఅధికారిసంజయ్ రత్నకుమార్, డీఎఫ్ఓ స్వరూప్, ఎస్ఈ బలరామరాజు ఉన్నారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

మాధవధార, మార్చి 6 ; గ్రేటర్ 51వ వార్డు మాధవదార, ఉడాకాలనీ, అంబేడ్కర్ కాలనీల్లో బుధవారం టీడీపీ వార్డు అధ్యక్షులు తాతినేని. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధిష్ఠానం ప్రకటించి సూపర్ సిక్స్ పథకాలపై పచారం నిర్వహించారు. వాహనంలో ఎల్ఈడీ స్క్రీన్‌పై పథకాలను డిస్‌ప్లే చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.

నడి రోడ్డుపై కత్తులతో వీరంగం

- వ్యక్తిగత కక్షలతో యువకుడిపై ప్రత్యర్థి వర్గం దాడి
- పోలీసుల అదుపులో నిందితులు ?

విశాఖపట్నం, మార్చి 6: నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి 10 గంటల సమ యంలో నడి రోడ్డుపై కత్తులతో యువకులు వీరంగం సృష్టించారు. దీనికి సంబంధించి పోలీసులు గోప్యత పాటిస్తున్నప్పటికీ విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు.. వివరాలు ఇలా ఉన్నాయి. పెదవాల్తేరు ప్రాంతానికి చెందిన రావాడ చంద్రశేఖర్, పవన్‌ల మధ్య ఆర్థిక లావాదేవీలున్నాయి. కొద్ది రోజులుగా ఈ విషయమై ఇద్దరికీ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి చంద్రశేఖర్ అన్న కుమార్తె పుట్టినరోజు వేడుకలు పెదవాల్తేరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. దీనిని అవకాశంగా మలచుకోవాలని భావించిన పవన్ మరో వ్యక్తితో కలిసి బైక్‌పై వచ్చి ఫంక్షన్ హాల్ ఎదురుగా గేటు వద్ద పార్క్ చేశాడు. ఈ నేపథ్యంలో పవన్, చంద్రశేఖర్‌ల మధ్య మళ్లీ వాగ్వాదం జరిగింది. ఫంక్షన్ పూర్తయిన తరువాత చంద్రశేఖర్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా విశాఖ ఐ ఆస్పత్రి జంక్షన్ వద్ద మాటు వేసిన కొంతమంది కత్తులతో అతనిపై దాడికి యత్నించారు. దీంతో చంద్రశేఖర్ బైక్ దిగి అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయాడు. ఈ ఘటనలో అతడికి స్వల్ప గాయాలయ్యాయి. అక్కడికి సమీపంలో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఇది గమనించి దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇరువర్గాల నుంచి సీఐ పార్థసారథి వాంగ్మూలం నమోదు చేశారు. ఈ సంఘటనలో స్థానిక వైసీపీ మహిళా నేత భర్త ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

కనకమహాలక్ష్మి తులసీదళార్చన పూజల్లో మార్పు

జగదాంబ కూడలి, మార్చి 6: కనకమహాలక్ష్మికి ప్రతీ గురువారం నిర్వహించే సహస్ర తులసీదళార్చన ప్రత్యేక సేవలను ఇకనుంచి శనివారం రోజు నిర్వహించేలా నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ ఈవో వి.శ్రీనివాసరెడ్డి ప్రకటన విడుదల చేశారు. గురువారం అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకొనే అవకాశం భక్తులకు లేనందున నిరాశ చెందుతున్నారన్నారు.ఈనేపథ్యంలలో అమ్మవారి సహస్ర తులసీ దళార్చ ప్రత్యేక సేవలు, ఇతర పూజలను ఈనెల 16 తేదీ నుంచి ప్రతీ శనివారం నిర్వహించనున్నట్టు తెలిపారు.

622 వ్యవసాయ మార్కెటింగ్ గొడౌన్‌లు పూర్తి

» చీఫ్ ఇంజనీర్ మద్దినేని శ్రీనివాస్

గోపాలపట్నం, మార్చి 6: రాష్ట్ర వ్యాప్తంగా 1054 గోదాముల నిర్మాణానికి ప్రారంభించగా, ఇప్పటి వరకు 622 నిర్మాణాలు పూర్తయినట్టు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ చీఫ్ ఇంజనీర్ మద్దినేని శ్రీనివాస్ తెలిపారు. స్థానిక జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 151 గోదాముల నిర్మాణం ప్రారంభించగా ఇప్పటి వరకూ 42 పూర్తయినట్లు తెలిపారు. నగరంలోని 13 రైతుబజారుల్లో రూ.1.48కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.



మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ మద్దినేని శ్రీనివాస్

మార్కెటింగ్ శాఖ చీఫ్ ఇంజనీర్‌గా కోటయ్య నియామకం

విశాఖ మార్కెటింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న టి.రవిప్రసాద్‌ను గుంటూరులోని రాష్ట్ర కార్యాలయానికి అటాచ్ చేస్తూ, అతని స్థానంలో శ్రీకాకుళం జిల్లాలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కోటయ్యను నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంతోపాటు మార్కెటింగ్ శాఖ చేపడుతున్న గోదాముల నిర్మాణంలో సక్రమంగా పర్యవేక్షించకపోవడంతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విధుల నుంచి తప్పిస్తూ గుంటూరులోని ప్రధాన కార్యాలయానికి పంపిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'జగన్ ఈసారి బంగాళాఖాతంలోనే ప్రమాణస్వీకారం'

సీతంపేట, మార్చి 6: విజన్ విశాఖ పేరుతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి డ్రామాలు ఆడు తున్నారని, ఈసారి విశాఖలో కాకుండా బంగాళాఖాతంలో ఆయన ప్రమాణ స్వీకారం చేస్తారని జనసేన పార్టీ పీఏసీ సభ్యులు కోన తాతారావు ఎద్దేవా చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ రాజధాని అంటూ ఇంకెన్నాళ్లు మోసం చేస్తారని నిలదీశారు. మూడు రాజధానుల పేరిట మూడు ముక్కలాటతో ప్రజల చెవిలో ఎన్నిసార్లు పూలు పెడతారని ప్రశ్నించారు. సమావేశంలో నార్త్ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, గోవిందరెడ్డి పాల్గొన్నారు.

బీసీలకు భరోసా

... 5వ పేజీ తరువాయి

ప్రకటించడం వల్ల భవిష్యతులో జరిగే స్థానిక సంస్థల్లో ఎక్కువ మందికి పదవులు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. అలాగే 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్, అది కూడా నెలకు రూ.4 వేలు ఇస్తామని చెప్పడం పట్ల బీసీల్లో సంతోషం వ్యక్తమవుతోంది. గ్రామాల్లో వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు, నగరాలు, పట్టణాల్లో భవన నిర్మాణ కార్మికులు, రోజువారీ కూలీలు, కలాసీలకు పింఛన్ పథకం ఉపయుక్తంగా ఉంటుందని రొంగలి చినదేముడు అనే కలాసీ అన్నారు. అలాగే గతంలో బడ్జెట్‌లో బీసీ సబ్‌ప్లాన్‌కు ప్రత్యేకించి నిధులు ఖర్చుచేసేవారు. జనాభా దామాషా మేరకు నిధులు కేటాయింపు ఉండేది. ప్రధానంగా బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు, ఆయా వర్గాల సంక్షేమానికి పథకాలు, బీసీలు నివసించే చోట్ల మౌలిక సదుపాయాలకు సబ్ ప్లాన్ నిధులు వెచ్చించేవారు. గడచిన ఐదేళ్లుగా ఆ నిధులను జగన్ ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించిందని బీసీ వర్గాలు ఆందోళన చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన కూటమి ఐదేళ్లలో సబ్‌ప్లాన్‌కు రూ.1.5 లక్షల కోట్లు కేటాయిస్తామని చెప్పడాన్ని మూర్తి యాదవ్ అనే ప్రైవేటు ఉద్యోగి స్వాగతించారు. అదేవిధంగా ఇంటికి పెద్దదిక్కుగా ఉండే వ్యక్తులు ప్రమాదవశాత్తూ మరణిస్తే కుటుంబానికి అండగా ఉండేందుకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రన్న బీమా అమలుచేయగా, వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దాన్ని అటకెక్కించింది. దానివల్ల ఈ ఐదేళ్లలో అనేకమంది పేదవర్గాలు తీవ్రంగా నష్టపోయాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని చంద్రన్న బీమా పథకాన్ని రూ.10 లక్షలకు పెంచుతున్నట్టు డిక్లరేషన్‌లో ప్రకటించడం చాలా ప్రయోజనకరమనే చెప్పాలి. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఆదరణ పథకం అమలుచేశారు. అదే పథకం టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తామని డిక్లరేషన్‌లో ప్రకటించారు. ఆదరణ పథకం కులవృత్తులకు మేలు చేస్తోందని రజక ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు రాజమండ్రి నారాయణ అభిప్రాయపడ్డారు. ఇంకా పీజీ విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్, విదేశీ విద్యా పథకం, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రం మంజూరు వంటి వాటిపై బీసీ యువత హర్షం వ్యక్తంచేస్తోంది.

విద్యార్థులకు ఎంతో ప్రయోజనం

-బొడ్డేటి హేమంతకుమార్, ఇంజనీరింగ్ విద్యార్థి, గోపాలపట్నం



టీడీపీ, జనసేన కూటమి బీసీ డిక్లరేషన్‌లోని పొందుపరిచిన శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు జారీ, విదేశీ విద్య, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరణ వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఉన్నత విద్యాభ్యాసం కల సాకారమవుతుంది. మంచి విజన్ ఉన్న నేతగా గుర్తింపు ఉన్న చంద్రబాబు విద్యార్థుల ప్రయోజనం కోసం ఇటువంటి ఆలోచన చేయడం హర్షణీయం.

ఫీజు పరేషాన్

... 5వ పేజీ తరువాయి

పది వేలకుపైగా ఉంది. వీరందరికీ ప్రభుత్వం మూడు విడతల ఫీజులు చెల్లించాల్సి ఉంది. నగర పరిధిలోని ఓ ప్రముఖ కాలేజీలో ఏడాదికి ఫీజు రూ.67,700. ప్రభుత్వం నాలుగు విడతల్లో ఈ మొత్తాన్ని చెల్లిస్తుంది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి తొలి విడత మొత్తాన్ని సీఎం ఒకటో తేదీన విడుదల చేశాడు. ఈ మేరకు ఫైనల్ ఇయర్ చదువుతున్న ఒక విద్యార్థి, తల్లి ఉమ్మడి ఖాతాలో రెండు రోజుల కిందట రూ.16,925 జమ అయింది. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు వెళ్లిన సదరు విద్యార్థికి...మిగిలిన మూడు విడతల ఫీజు కలిపి చెల్లించాలంటూ కాలేజీ యాజమాన్యం స్పష్టంచేసింది. లేదంటే హాల్ టికెట్ ఇచ్చేది లేదని తేల్చిచెప్పింది. చేసేదేమీ లేక మొత్తం ఫీజు చెల్లించాడు. ఇలా...ఒక్కో విద్యార్థిపై కాలేజీని బట్టి కనీసం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు భారం పడనున్నది. ఎన్నికల తరువాత పరిస్థితి ఎలా ఉంటుందోననే విద్యార్థుల నుంచి ఫీజులు రాబట్టుకునేందుకు కళాశాలలు ప్రయత్ని స్తున్నట్టున్నాయి.

నేడు సీఎం జగన్ రాక

... 5వ పేజీ తరువాయి

చేరుకుంటారు. 10.50 గంటలకు బస్సులో బయలుదేరి పిసినికాడలో ఏర్పాటుచేసిన బహిరంగ సభా వేదిక వద్దకు వెళతారు. కలెక్టరు రవి పట్టన్‌శెట్టి అధ్యక్షతన ఏర్పాటుచేసిన 'చేయూత' నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడతారు. అనంతరం బటన్ నొక్కి నిధులు విడుదల చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు వైసీపీ నాయకులతో సమావేశమవుతారు. 2.10 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖపట్నం విమానాశ్రయానికి బయలుదేరతారు. అక్కడి నుంచి 2.30 గంటలకు విమానంలో విజయవాడ బయలుదేరతారు.

వైసీపీ నేతల గ్రావెల్ దందా

... 5వ పేజీ తరువాయి

గండిగుండం, రామవరం తదితరచోట్ల గ్రావెల్‌ను అధికార పార్టీ నేతలు తవ్వుకుపోతున్నారు. ఆనందపురం మండల తహసీల్దారు కార్యాలయ అధికారులు, సిబ్బంది కూడా అధికార పార్టీ నేతల ఆదేశాల మేరకు పనిచేయడం తప్ప ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన తహసీల్దార్లు పూర్తిగా అధికార పార్టీ నేతల మాట మేరకు పనిచేశారని, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనా పట్టించుకోలేదని, కొత్తగా వచ్చిన అధికారి కేవలం ఎన్నికల విధులు మినహా కూడా మరో విషయం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారంటున్నారు. కాగా పెందుర్తి మండలంలో కూడా పలుచోట్ల వైసీపీ నేతలు కొండలను తవ్వుకుంటున్నారు. పలుమార్లు గనుల శాఖ దాడులు చేసి జరిమానా విధించినా లెక్క చేయడం లేదు. చివరకు గనుల శాఖ అధికారులకు కొందరు వైసీపీ నేతలు ఫోన్ చేసి గ్రావెల్ లారీలు తమవేనని, వాటి జోలికి వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. దీంతో ఎందుకొచ్చినా చిక్కు అంటూ గనుల శాఖ అధికారులు చూసీచూడనట్టు ఊరుకుంటున్నారు. పెందుర్తి మండలంలో జర్రిపోతులపాలెం, ఎస్.ఆర్.పురం, గుర్రంపాలెం, నరవ, తదితరచోట్ల రూ.కోట్ల విలువైన గ్రావెల్ అమ్ముకున్నారు.

తిరుమల, షిర్డీ రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

ఏడాది పొడవునా డిమాండ్ ఉంటుంది. విశాఖ నుంచి నేరుగా సాయినగర్ షిర్డీ స్టేషన్‌కు వెళ్లే ఏకైక రైలు ఇదొక్కటే కావడంతో డిమాండ్ అధికంగా ఉంటోంది.

ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు మేలో డిమాండ్

ప్రతి ఆదివారం వయా రాయగడ, రాయపూర్ మీదుగా మన్మాడ్ వెళ్లే విశాఖ-లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు (22847) సాధారణ డిమాండ్ నెలకొంది. షిర్డీ ఎక్స్‌ప్రెస్‌కు (18503) ప్రత్యామ్నాయంగా నిలిచిన ఎల్‌టీటీ (22847) ఎక్స్‌ప్రెస్‌కు మార్చిలో బెర్తులు నిండిపోగా ఏప్రిల్‌లో ఉన్నాయి. ఈ రైలు మన్మాడ్ వరకు వెళుతుంది. షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లో టికెట్ లభించనివారు ఈ రైలును ఆశ్రయించడంతో మే వరకూ బెర్తులు నిండిపోయాయి.

షిర్డీ ఎక్స్‌ప్రెస్ ఫ్రీక్వెన్సీ పెంపుపై వినతులు

షిర్డీ ఎక్స్‌ప్రెస్ ఫ్రీక్వెన్సీ పెంచాలన్న ప్రయాణికుల డిమాండ్‌పై రైల్వే అధికారులు దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. దాదాపు 16 ఏళ్ల క్రితం ప్రవేశపెట్టిన ఈ రైలు పట్టాలెక్కిన తొలిరోజు నుంచే ఆక్యుపెన్సీ తగ్గకుండా రాకపోకలు సాగిస్తోంది. వారానికి ఒకరోజు మాత్రమే అందుబాటులో ఉండడంతో షిర్డీ భక్తుల అవసరాలు తీరడం లేదని, కనీసం వారానికి రెండు రోజులైనా (బై వీక్లీ) నడిచే విధంగా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టిసారించి రైల్వే అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు.

రూ.54.4 కోట్లతో సింహగిరి అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

కాంప్లెక్స్, రూ.81 లక్షలతో కూరగాయల నిల్వకు కోల్డ్ స్టోరేజీ, 14 సీట్ల ఎలక్ట్రిక్ బస్సులు ఆరు, లగేజీ స్క్రీనింగ్ సిస్టమ్, సెక్యూరిటీకి కావలసిన మెటల్ డోర్ ఫ్రేమ్స్, డిటెక్టర్లు, మల్టీ మీడియా సెంటర్, తదితర పలు పనులను చేపట్టనున్నారు.



జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న పరమేశ్వరి, తదితరులు

జగన్‌కు ఓటు అడిగే అర్హత లేదు

ఏపీ మహిళా సమాఖ్య నాయకురాలు పరమేశ్వరి

గాజువాక, మార్చి 6: మద్యపాన నిషేధంలో సీఎం జగన్ పూర్తిగా విఫలమయ్యారని, ప్రజలను ఓట్లు అడిగే అర్హత ఆయనకు లేదని ఏపీ మహిళా సమాఖ్య అనకాపల్లి జిల్లా అధ్యక్షురాలు బూసి పరమేశ్వరి అన్నారు. మహిళా దినోత్సవంలో భాగంగా బుధవారం మదీనాబాగ్‌లో మహిళా సమాఖ్య జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బూటకపు హామీలతో జగన్ ప్రజలను మభ్యపెట్టారని విమర్శించారు. మద్యపానం వల్ల వాటిల్లుతున్న ఇబ్బందులను ఎన్నికల సమయంలో వివరించిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు నిషేధాన్ని అమలు చేయడంలో మాట మార్చారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనురాధ, టోప్పో, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

శిథిలమైన ప్రధాన డ్రైనేజీ

ఎక్కడికక్కడ మురుగు నీరు తిష్ట

దుర్వాసనతో సతమతమవుతున్న ప్రజలు



బీసీ రోడ్డు పక్కన శిథిలమైన డ్రైనేజీ

పెదగంట్యాడ, మార్చి 6: జీవీఎంసీ 65వ వార్డు పరిధి కాకతీయ జంక్షన్ నుంచి కేఎల్‌రావు నగర్ వరకు బీసీ రోడ్డు పక్కనున్న ప్రధాన డ్రైనేజీ పూర్తిగా శిథిలమైంది. దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ఈ డ్రైనేజీకి సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో ఇరువైపులా ఉన్న గట్లు విరిగి కాలువలో పడిపోయాయి. మట్టి, రాళ్లు, ఇతర వ్యర్థాలు పేరుకుపోవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు దిగువకు సాఫీగా వెళ్లడం లేదు. రోజుల తరబడి మురుగు తిష్ట వేయడంతో తీవ్ర దుర్వాసన వస్తుందని, దోమలు వృద్ధి చెంది స్థానికులపై దాడి చేస్తున్నాయని పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల అధికారులు స్పందించి బాలచెరువు రోడ్డు పక్కనున్న ఈ డ్రైనేజీకి మరమత్తులు చేపట్టవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

పదో తరగతి పరీక్ష పత్రాలు వచ్చేశాయి

మల్కాపురం, మార్చి 6 : ఈనెల 18వ తేదీ నుంచి పదోతరగతి పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో పదోతరగతి పరీక్ష ప్రశ్నపత్రాలు మల్కాపురం పోలీసు స్టేషన్‌కు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాల ప్రధాన ఉపాధ్యాయులు, ఇన్‌చార్జిలను సమక్షంలో పోలీసు స్టేషన్‌లో భద్రపరిచారు. పరీక్ష కు కొంతసమయం ముందు ఈ ప్రశ్నాపత్రాలను పోలీసుస్టేషన్ నుంచి పరీక్ష కేంద్రాలకు తీసుకెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. ప్రశ్నాపత్రాలను భద్రపరిచిన పెట్లుకు సీజ్ చేశారు.

సినిమా గైడ్

- **చారి 111 :** వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **భూతద్దం భాస్కరనారాయణ :** శారద, శరత్, ఊర్వశి (కంచరపాలెం) సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఇంటి నెం.13 :** లీలామహల్.
- **మా ఊరి రాజారెడ్డి :** క్రాంతి
- **రాధా మాధవం :** మౌర్య (గోపాలపట్నం)
- **భ్రమయుగం :** జగదాంబ, హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సప్తగిరి (తగరపువలస)
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్ ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి.
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25,టమాటా 17, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 44, బీరకాయలు 40, ఆనపకాయలు 15, కాలీఫ్లవర్ 24, క్యాబేజ్ 22, క్యారెట్ 24, దొండకాయలు 24, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 55, అల్లం (పాతది) 110, బరబాటి 15, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోసకాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 30, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 24 , కంద 64, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26,కర్రపెండలం 24, మామిడిఅల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 112
ఫారం ధర	-- 132
విత్ స్కిన్	-- 234
స్కిన్‌లెస్	-- 244

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

రోడ్డెక్కుతున్న ఉక్కు యువ ఉద్యోగులు



ఉక్కు పరిపాలన భవనం ముందు ఆందోళన చేస్తున్న యువ ఉద్యోగులు (ఫైల్)

నూతన వేతనాలను అమలు చేయాలంటూ నేడు స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం వద్ద 'తాలి బచావో'

కంచం, స్పూన్‌లతో శబ్దం చేస్తూ నిరసన

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 6: స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు నూతన వేతన సవరణను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యువ ఉద్యోగులు రోడ్డెక్కుతున్నారు. ఈ క్రమంలో గురువారం స్టీల్‌ప్లాంట్ టీఅండ్‌డీసీ జంక్షన్ నుంచి పరిపాలన భవనం వరకు 'తాలి బజావో' పేరుతో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

ఉద్యోగులకు నూతన వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వారం రోజుల కిందట ప్లాంట్ డైరెక్టర్‌ను నిర్బంధించడంతో పాటు సీఎండీ, డైరెక్టర్‌లను బయటకు వెళ్లకుండా చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు చేపడుతున్న 'తాలి బజావో'కు యువ ఉద్యోగులందరూ ఒక కంచం, స్పూన్‌లతో అధిక సంఖ్యలో హాజరై పెద్దగా శబ్దం చేసి తమ ఆవేదనను ఉక్కు యాజమాన్యానికి వినిపించేలా చేద్దామని నాయకులు పేర్కొన్నారు.

ఇవీ డిమాండ్లు..

- తక్షణమే 2017 వేతన సవరణ చేయాలి
- సెయిల్‌లో మాదిరిగానే వేతనాలను అందించాలి
- కార్మికులకు మౌలిక సదుపాయాలు కల్పించాకే బయోమెట్రిక్‌ను అమలు చేయాలి
- పూర్తి ఉత్పత్తి చేపట్టాలి. ఇందుకోసం వనరులను యాజమాన్యం సమకూర్చాలి
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను ఆపాలి. లేకుంటే సెయిల్‌లో విలీనం చేయాలి.

న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి



ఉక్కు కర్మాగారం ఉద్యోగులకు నూతన వేతన సవరణను త్వరితంగా అమలు చేయాలి. కార్మికుల ఆవేదనను యాజమాన్యం దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. కొత్త వేతనాలు అమలుకు నోచుకోకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్మికుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేలా యాజమాన్యం చర్యలు చేపట్టాలి.

–చంద్రశేఖర్, ఉక్కు ఉద్యోగి

భూ కబ్జాలపై 'ప్రత్యేక స్పందన'కు మంచి స్పందన

పోలీస్ స్టేషన్లకు తరలివచ్చిన ప్రజలు

దువ్వాడలో 22 మంది, గాజువాకలో 16 మంది, న్యూ పోర్టు స్టేషన్‌లో ఐదుగురి నుంచి ఫిర్యాదులు స్వీకరణ



గాజువాకలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు



దువ్వాడలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీపీ మోకా సత్తిబాబు

గాజువాక, మార్చి 6: భూ కబ్జాలపై బాధితులు, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని చేపట్టాలన్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశాల మేరకు బుధవారం పలు పోలీస్ స్టేషన్లలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇందులో భాగంగా గాజువాక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి 16 మంది హాజరై ఫిర్యాదులు చేశారు. ట్రాఫిక్ ఏడీసీపీ ఎం.శ్రీనివాసరావు, సీఐ ఎం.శ్రీనివాసరావు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అదేవిధంగా న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ ఏసీపీ వాసుదేవ, సీఐ దాలిబాబులు భూ ఆక్రమణలకు సంబంధించి ఐదుగురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

దువ్వాడలో 22 ఫిర్యాదులు..

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో భూ తగాదాలు, కబ్జాలకు సంబంధించి డీసీపీ మోకా సత్తిబాబు 22 మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తప్పుడు డాక్యుమెంట్లతో స్థల ఆక్రమణలపై నిర్వాసిత కాలనీల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. అన్యాయంగా ఎవరి స్థలాలనైనా కబ్జా చేయాలని చేసేవారు ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తీసుకుంటాని డీసీపీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎర్రన్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభిస్తున్న బీకే రజని

అగనంపూడి, మార్చి 6 ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ అగనంపూడి శాఖ ఆధ్వర్యంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక బీసీ కాలనీలోని దివ్యజ్యోతి భవన్ వద్ద బుధవారం ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని బ్రహ్మకుమారీస్ కాకినాడ జిల్లా ఇన్‌చార్జి బీకే రజని ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశంలో అనేక ప్రాంతాల్లో ఉన్న జ్యోతిర్లింగాలను ఒకేచోట భక్తులు దర్శించేలా ఏర్పాట్లు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వక్తం గ్రామాల్లో బ్రహ్మకుమారీస్ చేస్తున్న ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను వివరించారు. నాలుగు రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుందని, భక్తులంతా జ్యోతిర్లింగాలను దర్శించుకోవాలని ఆమె కోరారు. అనంతరం భక్తిశ్రద్ధలతో శివుడికి పూజలు చేశారు. పలువురు భక్తులు ద్వాదశ జ్యోతిర్లింగాలను తిలకించారు. సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంస్థ జిల్లా ఇన్‌చార్జి బీకే వేణి, సీతక్క, అపరంజి, బీకే సోమేశ్వరి, రామకోటి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఓటమితోనే రాష్ట్రానికి భవిష్యత్తు

'పశ్చిమ' ఎమ్మెల్యే గణబాబు



ఎమ్మెల్యే గణబాబుకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

మల్కాపురం, మార్చి 6 : గ్రేటర్ విశాఖ 59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ పరిధిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఎ మ్మెల్యే గణబాబు బుధవారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం 62వ వార్డు త్రినాద్‌పురంలో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన వైసీపీ ఓటమితో రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని జగన్ ప్రభుత్వం అన్ని విధాల నాశనం చేసిందన్నారు. ఈ ప్రచారం టీడీపీ, జనసేన ఉమ్మడిగా దుర్గానగర్, అల్లూరి సీతారామరాజు కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, గుడివాడ అప్పన్నకాలనీ, తెలుగుదేశం కాలనీ, అంబేద్కర్‌కాలనీ, ప్రకాశ్‌కాలనీ, అచ్చినాయుడులోవ, ప్రకాశనగర్, గవరపేటలో ప్రచారం చేపట్టారు. టీడీపీ పార్టీ అధ్యక్షుడు మజ్జిమాలినాయుడు, నాయకులు డొప్ప సన్యాసి రావు, కొరిబిల్లిరాము, పెంటకోట హరిబాబు, జనసేన పార్టీ సమన్వయ కర్త అంగ దుర్గా ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌తో ఎంతో మేలు

గోపాలపట్నం: బీసీల అభ్యున్నతికి తెలుగుదేశం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ లేకుండా పోయిందని, గత ఐదేళ్లలో ఆ సామాజిక వర్గాల హత్యలే దీనికి నిదర్శనమని అన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు ఉమ్మడిగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతికి కోఆప్షన్ చట్టం, చట్టబద్ధమైన కులగణన, విదేశీ విద్య పథకం, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాలు దోహదపడతాయని అన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం

మల్కాపురం : గాజువాక ఆర్టీసీ డిపో సమీపంలోని జింక్ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన సీతారామ కళ్యాణమండపం, అదనంగా నిర్మించిన రెండు గదులను వైసీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సోదరి యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిల్లా రమాకుమారి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ తండ్రి జ్ఞాపకారం ఈ రెండు గదులను నిర్మించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గంట్యాడ కృష్ణమూర్తి, డైరెక్టర్లు చల్లపల్లి అప్పలరాజు, నాగవల్లి, డైరెక్టర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం పంపిణీ..

ఎన్.ఎ.డి. జంక్షన్ మార్చి 6: కాకానీనగర్‌లో స్థానిక సంఘ సేవకురాలు మేడపురెడ్డి పద్మావతి తన నివాసంలో మహిళా దినోత్సవంను ఘనంగా నిర్వహించాను. అనంతరం పరిసరాల్లో ఉన్న నిరుపేద 30 కుటుంబాలకు బియ్యం ప్యాకెట్లును, 50 మందికి ఆహారప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వరలక్ష్మి భాను, సత్యవతి, రమ, కవిత, ఝాన్సి ధనలత, వాణి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే రాణింపు: అడిషనల్ కమిషనర్



విద్యార్థులతో మాట్లాడుతున్న విశ్వనాథ్

మల్కాపురం, మార్చి 6 : విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే భవిష్యత్ ఉంటుందని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథ్ పేర్కొన్నారు. మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విభాగానికి చెందిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) లిమిటెడ్ వారి రూ. 50 లక్షల సహాయంతో డైనింగ్ హాల్‌ను, ఆర్‌వో ప్లాంట్‌ను నిర్మించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పాఠశాలలో డైనింగ్ హాల్‌ను నిర్మించడం, ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటుచేయడం ఎంతో అభినందనీయమని తెలియజేశారు. హెచ్‌ఎం ఎల్ అరుణకుమారి, ఐ ఓ సీ జనరల్‌మేనేజర్ సురేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదుల వెల్లువ

పెందుర్తి స్పెషల్ డ్రైవ్‌కు 54 వినతులు



పోలీసు స్టేషన్ ఎదుట టీడీపీనేత కరకదేవుడు రైతులు



పెందుర్తిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న క్రైమ్ ఏడీసీపీ గంగాధర్

పెందుర్తి, మార్చి 6: భూ కబ్జాలు, భూతగాదాలు తదితర సమస్యలపై బుధవారం స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా పెందుర్తి పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన ఫిర్యాదుల స్వీకరణకు స్పందన లభించింది. ఇన్‌చార్జి క్రైం ఏడీసీపీ గంగాధర్ ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. శాఖపరంగా సమగ్ర విచారణ చేపట్టి భూకబ్జాదారులపై పీడీ యాక్ట్ నమోదు, అవసరమైతే నగర బహిష్కరణకు సిఫార్స్ చేయనున్నట్టు తెలిపారు. ఉదయం 10.30 నుంచి 3 గంటలు వరకు ఫిర్యాదులు స్వీకరించారు. భూకబ్జా, తగాదాలపై 54 పిటీషన్లు అందినట్లు సీఐ ఎల్ రామకృష్ణ ఈసందర్భంగా పేర్కొన్నారు. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్, నరవ ప్రాంతాలనుంచిఅధిక ఫిర్యాదులు వచ్చాయి. భూ వివాదాలపై కోర్టు కేసులు, తప్పుడు డాక్యుమెంట్లతో స్థలాలను ఆక్రమించి విక్రయాలు, నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో భూముల ఆక్రమణపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

కరకవానిపాలెంలో 69 ఎకరాల ఆక్రమణ

గొరపల్లి పంచాయతీపరిధి కరకవానిపాలెంలో సర్వే నంబర్ 218-1లో రైతుల సాగులోని భూములను స్థానికేతరులు తప్పుడు పత్రాలు సృష్టించి ఆక్రమణకు దిగుతున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు కరక దేవుడు ఆధ్వర్యంలో రైతులు ఫిర్యాదు చేశారు. ఓ న్యాయవాది సహకారంతో ప్రకాశం జిల్లాకు చెందిన ప్రకాశం, పశ్చిమ గోదావరి చెందిన జిల్లాలకు చెందిన కొంతమంది ఈ దందాకు పాల్పడుతున్నారన్నారు.

మల్కాపురంలో నాలుగు..

మల్కాపురం: మల్కాపురం పోలీసు స్టేషన్ పరిధిలో భూ అక్రమణలకు సంబంధించి నాలుగు ఫిర్యాదులు అందాయి. హార్బర్ సర్కిల్ ఏసీపీ మోసేస్‌పాల్ ఆధ్వర్యంలో వీటిని స్వీకరించారు.

గోపాలపట్నం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రెండు ఫిర్యాదులు అందాయి. ఎల్లపువానిపాలెంనకు చెందిన కర్రి అ మ్మాజీ భూ వివాదంపై, ఏపీఎస్ఈబీ కాలనీకు చెందిన కేవీ సత్యనారాయణ ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని ఫిర్యాదు చేశారు. వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి ఫిర్యాదులు స్వీకరించారు.

శేషాద్రినగర్ ఆక్రమణపై ఫిర్యాదు..

వేపగుంట: చిమాలపల్లి దరి శేషాద్రినగర్ జనచైతన్య లేఅవుట్‌లో రోడ్డును ఆక్రమించి, వైసీపీ నాయకులు అండతో చేపడుతున్న ఇంటి నిర్మాణంపై పెందుర్తి పోలీసులకు బుధవారం శేషాద్రినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేశారు.



బాధితుడితో మాట్లాడుతున్న వెస్ట్ ఏసీపీ



రిబ్బన్ కట్ చేసి స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న ఉక్కు సీఎండీ అతుల్‌భట్

ఆకట్టుకుంటున్న ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో

ఆటోనగర్, మార్చి 6: విభిన్న ఆలోచనలు, నవ్య ఆవిష్కరణలకు వేదికగా నిలిచింది ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో-2024. ఆటోనగర్‌లోని ఎంఎస్ఎంఈ కార్యాలయ ప్రాంగణంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు (మినిస్ట్రీ ఆఫ్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ), విశాఖ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఎక్స్‌పోకు విశేష స్పందన లభించింది. పారిశ్రామిక ఉత్పత్తులు, బ్యాంకులకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పరిశ్రమలకు కావాల్సిన మిషనరీ, ఆర్గానిక్ ఉత్పత్తులు,లెదర్,నిర్మాణ రంగానికి సంబంధించిన కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించి ఉత్పత్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రెండు రోజులపాటు ఎంఎస్ఎంఈ, వాసీవా సంయుక్తంగా నిర్వహిస్తున్న వెండర్ డెవలప్‌మెంట్ అమ్మకందారులు, కొనుగోలుదారుల ఇంట్రాక్షన్ సమావేశం (ఎంఎస్ఎంఈ ఎక్స్ పో-2024)ను తొలుత స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంఎస్ఎంఈల ప్రయోజనాల కోసం వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించిన ఎంఎస్ఎంఈ-డీఎఫ్‌వో కృషిని అభినందించారు. ఎంఎస్ఎంఈ అదనపు డెవలప్‌మెంట్ కమిషనర్ డి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద రిజిస్ట్రేషన్లు సంఖ్యాపరంగా దేశంలోనే ఏపీ రెండో స్థానంలో ఉందన్నారు. ఎంఎస్ఎంఈ ఏడీ అప్పికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక ఎంఎస్ఎంఈలకు ఆర్ఐఎన్ఎల్ మంచి ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ దేశ ప్రగతికి ఎంఎస్ఎంఈలు వెన్నెముకగా నిలుస్తున్నాయన్నారు. వాసీవా అధ్యక్ష, కార్యదర్శులు సజ్జా పాండురంగప్రసాద్, పి.ప్రభాకర్‌లు మాట్లాడుతూ ఈ ఎక్స్‌పోకు మంచి స్పందన రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లఘు ఉద్యోగ భారతి ప్రెసిడెంట్ ఏకే బాలాజీ, ఐలా కమిషనర్ కె.జయచంద్ర, చైర్మన్ సత్యనారాయణరెడ్డి (రఘు),బీడీఎల్ జీఎం సింహాచలం, షిప్‌యార్డు డైరెక్టర్ రాంబాబు, కెనరా బ్యాంక్ ఏజీఎం మధుసూదన రెడ్డి, ఎంఎస్ఎంఈ ఏడీలు చంద్రమౌళి, ప్రభాకరకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐ శ్రీనివాస్‌కు సత్కారం



ఏఎస్ఐను సత్కరిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఉక్కు కార్మిక నాయకులు

ఉక్కుటౌన్ షిప్, మార్చి 6: స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన శ్రీనివాస్‌ను సీఐ వి.శ్రీనివాసరావు, ఉక్కు కార్మిక సంఘ నాయకులు అరుగుల మణికుమార్, వై.మస్తానప్పలు బుధవారం సత్కరించారు. పోలీస్ స్టేషన్‌లో జరిగిన సత్కార సభలో పలువురు శ్రీనివాస్ అందించిన సేవలను కొనియాడారు. నీతి, నిజాయితీకి శ్రీనివాస్ నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సన్మానిస్తున్న పద్మావతినగర్ కాలనీవాసులు

వేపగుంట మార్చి 6: గ్రేటర్ 98వ వార్డు పద్మావతినగర్ కొండ చుట్టూ దాదాపు రూ. 20లక్షలతో నూతనంగా చేపట్టనున్న వాకింగ్ ట్రాక్, బహిరంగ వ్యాయామ పరికరాల ఏర్పాటు పనులను బుధవారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభించారు.ఈసందర్భంగా పద్మావతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు అదీప్‌రాజ్‌కు సన్మానం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పి.చంద్రమౌళి, కార్యదర్శి సత్తిబాబు, రవికుమార్, వెంకటేశ్వరరావు, నారాయణరావు, జగన్నాథరావు ఉన్నారు.

పార్కుల్లో రక్షణ గోడ నిర్మాణానికి ..

వేపగుంట: గ్రేటర్ 93వ వార్డు బాలాజీ గార్డెన్స్‌లో 3 పార్కులకు రక్షణ గోడ నిర్మాణంతోపాటు రూ.28.83లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా ఆయా కాలనీవాసులతో కలసి ప్రారంభించారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

సింధియా, మార్చి 6: జీవీఎంసీ 40వ వార్డులో బుధవారం యలమంచిలి మున్సిపల్ చైర్మన్ పిలా రమాకుమారి పర్యటించారు. నూకాంబికా వేల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ భవనం, అంబేడ్కర్ కమ్యూనిటీ భవనాలను ప్రారంభించారు. జగనన్న ఇళ్ల స్థల లబ్ధిదారులు 212మందికి పట్టాలు అందజేశారు. కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

'ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి'

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 6: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ప్రధాన జంక్షన్‌ల వద్ద స్టాపర్లను ఏర్పాటు చేశారు. కాగా టౌన్‌షిప్‌లో పలుచోట్ల సీసీ కెమెరాలను నెలకొల్పారు.

మహిళలకు చీరలు పంపిణీ..

పూర్ణామార్కెట్, మార్చి 6: గ్రేటర్ 35 వార్డు పూర్ణామార్కెట్, దుర్గాలమ్మ గుడి ప్రాంత బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ బుధవారం పర్యటించారు. బుధవారం వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుతో కలసి దుర్గాలమ్మగుడి పరిసర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి మహిళలను కలసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదుల స్వీకరణ

సీతంపేట, మార్చి 6: భూ కబ్జాలు, ఆక్రమణలకు సంబంధించి ఫిర్యాదులను బుధవారం నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఏసీపీ బి.మెహర్ జయరాం ప్రసాద్ స్వీకరించారు. లలితా నగర్‌కి చెందిన తమ ఇంటిని ఆక్రమించారని బాధితురాలు రాజ్యలక్ష్మి ఫిర్యాదు చేశారు. తన భర్త మద్ది శ్రీనివాసరెడ్డి అలియాస్ వాసుకి చెందిన సొంత బంధువులే మోసం చేశారని, దీంతో మనోవేదనతో శ్రీనివాసరెడ్డి కొద్ది కాలం క్రితం గెండెనొప్పితో మృతి చెందారని, న్యాయం చేయాలని రాజ్యలక్ష్మి కోరారు. అక్కయ్యపాలెం శ్రీనివాసనగర్‌కి చెందిన సూరిశెట్టి హేమాంగిణి తన భర్త వెంకటరామ్‌కుమార్‌కి తండ్రి నుంచి వచ్చిన అక్కయ్యపాలెం రామచంద్రనగర్‌లో గల స్థలాన్ని బంధువులైన సూరిశెట్టి నరసింహమూర్తి, గౌరి శంకర్‌లు తప్పుడు పత్రాలతో తమ స్థలం కబ్జాకు చేయడానికి చూస్తున్నారని తెలిపారు. ద్వారకా పోలీసు స్టేషన్‌లో ఏడీసీపీ ఎంఆర్‌కె రాజు ఆధ్వర్యంలో సీఐ రమేష్ బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. నక్కవానిపాలెంలో ఏడుగుళ్ల స్థలం గురవుతుందని గ్రామ కమిటీ పెద్దలు ఫిర్యాదు ఇచ్చారు. సీఐ సీఐ విజయ్‌కుమార్‌కి, ఎస్‌ఐ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ కూడలి: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భూకబ్జాలు, ఆక్రమణలపై బుధవారం నగర ఏసీపీ ట్రాఫిక్ 2 జి. రాజీవ్‌కుమార్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆనందపురం వద్దనున్న తన 300 గజాల స్థలం ఆక్రమణకు గురైనట్టు పాతనగరంలో నివాసముంటున్న బాధితుడు ఫిర్యాదు అందజేశారు. నగర పోలీస్ కమిషనరేట్‌కు వచ్చిన ఫిర్యాదులను అందజేస్తామని పోలీసులు తెలిపారు.



వన్‌టౌన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఏసీపీ రాజీవ్‌కుమార్



నాలుగో టౌన్ స్టేషన్‌లో ఏసీపీ మెహర్ జయరాం ప్రసాద్

విమ్స్‌లో ఉత్తమ వైద్య సేవలు : కలెక్టర్



గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ, మార్చి 6: ఉత్తరాంధ్ర వాసులకు విమ్స్ ఒక వరమని కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున అన్నారు. ఆస్పత్రిలో రూ.2కోట్లతో ఏర్పాటు చేసిన గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండేళ్లుగా విమ్స్ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నామన్నారు. అన్నిరకాల సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ కె.రాంబాబు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఈడీ అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం

వెంకోజీపాలెం, మార్చి 6: నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకుస్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన స్థాయీ సంఘం సమావేశంలో ఆమె మాట్లాడుతూ 68 అజెండా అంశాలతో పాటు 28 టేబుల్ అజెండా అంశాలను సభ్యులు చర్చ లేకుండానే ఆమోదించారన్నారు. రెవెన్యూ విభాగానికి చెందిన లీజుల పొడిగింపు, ఆశీలు వసూలు, ప్రజారోగ్య విభాగానికి పలు వార్డుల్లో తాత్కాలిక పద్ధతిపై అదనపు పారిశుధ్య కార్మికుల నియామకం, జేసీబీలతో వ్యర్థాల తొలగింపు, వెటర్నరీ విభాగానికి మందుల కొనుగోలు, తదితర అంశాలకు ఆమోదం లభించిందన్నారు.

ఎర్నిమాంబ ఆలయ ట్రస్ట్ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

జ్ఞానాపురం, మార్చి 6: ఎన్నో ఏళ్లుగా వివాదాలతో జాప్యమవుతు వస్తున్న జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయం ట్రస్ట్ సభ్యుల ప్రమాణ స్వీకారం ఎట్టకేలకు బుధవారం జరిగింది. కోర్టులో వివాదం పరిష్కారం కావడంతో ఈ ప్రమాణం స్వీకారం ఏర్పాటు చేసినట్టు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరిష తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్ కుమార్, కార్పొరేటర్ తోటపద్మావతి హాజరయ్యారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్‌గా లండారమణ, సభ్యులుగా చుక్కాశ్యామ్‌సుందర్ రెడ్డి, కోశెట్టి దేవి, యలమశెట్టి లక్ష్మి, కర్రి ధనయమ్మ, కుంచపు ఆదినారాయణ,వాసుపల్లి నారాయణరావు,కణికి గౌరి, కె. తేజారత్నం ఎన్నికయ్యారు. ఆలయ ఈవో సురేష్‌బాబాలింగం శ్రీను ఉన్నారు.

రైల్వేలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాఖపట్నం, మార్చి 6: అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా వాల్తేరు రైల్వేలో బుధవారం మహిళా సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్ఎం సౌరభ్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా సాధికారతకు వాల్తేరు రైల్వే ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. అనంతరం ఆర్పీఎఫ్, కమర్షియల్, ఆపరేటింగ్, ఇంజనీరింగ్, మెడికల్ శాఖలలో ఫ్రంట్‌లైన్ ఉద్యోగులుగా సేవలందిస్తున్న 24 మంది మహిళలకు మెరిట్ సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేసి అభినందించారు. లా కాలేజీ ఆఫ్ ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం ప్రత్యేక అతిథి హాజరై జెండర్ సెన్సిటైజేషన్‌పై ప్రసంగించి అవగాహన కల్పించారు. ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా, మనోజ్‌కుమార్ సాహు, పాల్గొన్నారు.

'టీడీపీ నేత గోగినేని మృతి తీరని లోటు

అక్కయ్యపాలెం, మార్చి 6: ఎన్టీఆర్ సంక్షేమ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు, టీడీపీ మాజీ కార్పొరేటర్ గోగినేని సాంబశివరావు మృతి పార్టీకే తీరని లోటని ఎంవీఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత ఎం.వెంకటరావు, లీడర్ పత్రిక అధినేత విల్లూరి వెంకటరమణమూర్తి అన్నారు. ఎన్టీఆర్ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం సుబ్బలక్ష్మినగర్‌లోని సుబ్బలక్ష్మి కల్యాణమండపంలో సాంబశివరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దువ్వి కాశీప్రసాద్, కన్నం వెంకటరమణారావు, ఎం.శ్రీకృష్ణ, జేకే, ఎంఎల్ఎన్ రావు, తోట శ్రీదేవి, శ్రీవేణి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సీఎం పర్యటనతో హైవే బంద్

» లంకెలపాలెం, పరవాడ, అచ్యుతాపురం, ఎలమంచిలి మీదుగా ట్రాఫిక్ మళ్లింపు

అనకాపల్లి రూరల్, మార్చి 6: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురువారం అనకాపల్లి జిల్లా పర్యటన సందర్భంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా భారీ వాహనాల ను దారి మళ్లిస్తున్నట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. చేయూత పథకం నిధులు విడుదల చేసేందుకు పిసినికాడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యే అవకాశం ఉన్నందున ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. విశాఖ నుంచి అనకాపల్లి మీదుగా వెళ్లే వాహనాలు లంకెలపాలెం జంక్షన్ నుంచి పరవాడ, అచ్యుతాపురం, ఎలమంచిలి, రేగుపాలెం జంక్షన్ మీదుగా వెళ్లాలన్నారు. తుని నుంచి అనకాపల్లి మీదుగా విశాఖ వైపు వెళ్లే భారీ వాహనాలు రేగుపాలెం జంక్షన్ నుంచి ఎలమంచిలి, అచ్యుతాపురం, పరవాడ మీదుగా లంకెలపాలెం జంక్షన్‌కు చేరుకోవాల న్నారు. శ్రీకాకుళం వైపు నుంచి ఆనందపురం- అనకాపల్లి నాలుగు వరుసల జాతీయ రహదారి మీదుగా వచ్చే వాహనాలు సబ్బవరం వద్ద సర్వీసు రోడ్డులోకి మారి, అసకపల్లి, లంకెలపాలెం జంక్షన్, పరవాడ, అచ్యుతాపురం ఎలమంచిలి మీదుగా రేగుపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకుని తుని వైపు వెళ్లవచ్చునన్నారు. చోడవరం నుంచి తుని వైపు వెళ్లే వాహనాలు అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు, మునగపాక, అచ్యుతాపురం జంక్షన్, ఎలమంచిలి మీదుగా రేగుపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపైకి చేరుకుని తుని వెళ్లాలన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



కళ్యాణోత్సవంలో పార్వతీపరమేశ్వరులు

సీతమ్మధార, మార్చి 6: గ్రేటర్ 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి పైల శేఖర్‌బాబు ఆధ్వర్యంలో అర్చకులు రామారావు శర్మ, మహేశ్ శర్మలు ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిపారు. మూల విరాట్ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, మేళతాళలతో స్వామి, అమ్మవార్లను పల్లకిపై తిరువీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఆలయ శివపార్వతుల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ నక్కా అప్పలరెడ్డి, ధర్మకర్తలు జాన్, నక్కా జ్యోతి, నాగమణి పాల్గొన్నారు.

తక్షణమే జేటీఓ పరీక్షలను నిర్వహించాలి..

డాబాగార్డెన్స్, మార్చి 6: పంజాబ్ సర్కిల్‌లోని మూడు జేటీఓ ఎల్‌ఐసీఈ పరీక్షలు రద్దు చేయడం అన్యాయమని బీఎస్ఎన్ఎల్ ఈయూ సభ్యులు అన్నారు.ఈ మేరకు డాబాగార్డెన్స్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయ ఆవరణలో బుధవారం మధ్యాహ్నం లంచ్ అవర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2015 నుంచి 2018 వరకు సంబంధించిన ఖాళీలకు చాలా ఏళ్ల తర్వాత పంజాబ్ సర్కిల్‌లో మూడు జేటీఓ ఎల్‌ఐసీఈ పరీక్షలు చేశారన్నారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు సాగర్, తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో గుండెపోటుతో విశాఖ భక్తుడి మృతి

ఐరాల(కాణిపాకం), మార్చి 6: చిత్తూరు జిల్లా కాణిపాకంలో వరసిద్ధి వినాయకస్వామిని దర్శించుకుని బయటకు వచ్చిన ఒక భక్తుడు గుండెపోటుతో మృతి చెందాడు. విశాఖపట్టణానికి చెందిన నాగబాబు(58) బుధవారం ఉదయం 9గంటలకు కుటుంబ సభ్యులతో కలసి వరసిద్ధుడిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసాదాలు కొనుగోలు చేయడానికి ఆలయం వెనుక వైపున్న లడ్డూ ప్రసాదాల కౌంటర్ వద్దకు చేరుకున్నారు. అక్కడే కుప్పకూలిపోవడంతో నాగబాబును చిగరపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు.

ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు అభినందన

కంచరపాలెం, మార్చి 6 : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన విద్యార్థులకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి అభినందించారు. కళాశాలను ఆమె బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆదిత్య బిర్లా గ్రూప్‌లో ఇటీవల ఉద్యోగాలు పొందిన నలుగురు విద్యార్థినులకు నియామకపత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సాంకేతిక విద్య డీడీ డా. ఎం.ఎ.వి. రామకృష్ణ, ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ,డా. బి.వి. లక్ష్మణరావు పాల్గొన్నారు

వీఎంఆర్‌డీఏ అభివృద్ధికి కృషి : చైర్మన్

సిరిపురం, మార్చి 6 : వీఎంఆర్‌డీఏ అభివృద్ధికి కృషి చేస్తానని ఆ సంస్థ చైర్మన్ సనపాల చంద్రమౌళి పేర్కొన్నారు. బుధవారం ఆయన వీఎంఆర్‌డీఏ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. సంస్థపై తనకు పూర్తి అవగాహన ఉందని, సిబ్బంది సమయపాలన, అంకితభావంతో పనిచేస్తూ సహాయ సహకారాలు అందిస్తే సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చేలా కృషి చేస్తానన్నారు. ఆయనతో పాటు జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, చీఫ్ ఇంజనీర్ భవానీ శంకర్, చీఫ్‌ప్రణాళికఅధికారిసంజయ్ రత్నకుమార్, డీఎఫ్‌ఓ స్వరూప్, ఎస్ఈ బలరామరాజు ఉన్నారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

మాధవధార, మార్చి 6 ; గ్రేటర్ 51వ వార్డు మాధవధార, ఉడాకాలనీ, అంబేడ్కర్ కాలనీల్లో బుధవారం టీడీపీ వార్డు అధ్యక్షులు తాతినేని. శ్రీనివాసరావు అధ్వర్యంలో అధిష్ఠానం ప్రకటించి సూపర్ సిక్స్ పథకాలపై పచారం నిర్వహించారు. వాహనంలో ఎల్ఈడీ స్క్రీన్‌పై పథకాలను డిస్‌ప్లే చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.

నడి రోడ్డుపై కత్తులతో వీరంగం

- వ్యక్తిగత కక్షలతో యువకుడిపై ప్రత్యర్థి వర్గం దాడి
- పోలీసుల అదుపులో నిందితులు ?

విశాఖపట్నం, మార్చి 6: నగరంలోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి 10 గంటల సమ యంలో నడి రోడ్డుపై కత్తులతో యువకులు వీరంగం సృష్టించారు. దీనికి సంబంధించి పోలీసులు గోప్యత పాటిస్తున్నప్పటికీ విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు.. వివరాలు ఇలా ఉన్నాయి. పెదవాల్తేరు ప్రాంతానికి చెందిన రావాడ చంద్రశేఖర్, పవన్‌ల మధ్య ఆర్థిక లావాదేవీలున్నాయి. కొద్ది రోజులుగా ఈ విషయమై ఇద్దరికీ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి చంద్రశేఖర్ అన్న కుమార్తె పుట్టినరోజు వేడుకలు పెదవాల్తేరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. దీనిని అవకాశంగా మలచుకోవాలని భావించిన పవన్ మరో వ్యక్తితో కలిసి బైక్‌పై వచ్చి ఫంక్షన్ హాల్ ఎదురుగా గేటు వద్ద పార్క్ చేశాడు. ఈ నేపథ్యంలో పవన్, చంద్రశేఖర్‌ల మధ్య మళ్లీ వాగ్వాదం జరిగింది. ఫంక్షన్ పూర్తయిన తరువాత చంద్రశేఖర్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా విశాఖ ఐ ఆస్పత్రి జంక్షన్ వద్ద మాటు వేసిన కొంతమంది కత్తులతో అతనిపై దాడికి యత్నించారు. దీంతో చంద్రశేఖర్ బైక్ దిగి అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయాడు. ఈ ఘటనలో అతడికి స్వల్ప గాయాలయ్యాయి. అక్కడికి సమీపంలో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఇది గమనించి దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇరువర్గాల నుంచి సీఐ పార్థసారథి వాంగ్మూలం నమోదు చేశారు. ఈ సంఘటనలో స్థానిక వైసీపీ మహిళా నేత భర్త ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

కనకమహాలక్ష్మి తులసీదళార్చన పూజల్లో మార్పు

జగదాంబ కూడలి, మార్చి 6:కనకమహాలక్ష్మికి ప్రతీ గురువారం నిర్వహించే సహస్ర తులసీదళార్చన ప్రత్యేక సేవలను ఇకనుంచి శనివారం రోజు నిర్వహించేలా నిర్ణయించారు. ఈ మేరకు ఆలయ ఈవో వి.శ్రీనివాసరెడ్డి ప్రకటన విడుదల చేశారు. గురువారం అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకొనే అవకాశం భక్తులకు లేనందున నిరాశ చెందుతున్నారన్నారు.ఈనేపథ్యంలలో అమ్మవారి సహస్ర తులసీ దళార్చ ప్రత్యేక సేవలు, ఇతర పూజలను ఈనెల 16 తేదీ నుంచి ప్రతీ శనివారం నిర్వహించనున్నట్టు తెలిపారు.

622 వ్యవసాయ మార్కెటింగ్ గొడౌన్‌లు పూర్తి

» చీఫ్ ఇంజనీర్ మద్దినేని శ్రీనివాస్



మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ మద్దినేని శ్రీనివాస్

గోపాలపట్నం, మార్చి 6: రాష్ట్ర వ్యాప్తంగా 1054 గోదాముల నిర్మాణానికి ప్రారంభించగా, ఇప్పటి వరకు 622 నిర్మాణాలు పూర్తయినట్టు రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ చీఫ్ ఇంజనీర్ మద్దినేని శ్రీనివాస్ తెలిపారు. స్థానిక జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 151 గోదాముల నిర్మాణం ప్రారంభించగా ఇప్పటి వరకూ 42 పూర్తయినట్టు తెలిపారు. నగరంలోని 13 రైతుబజారుల్లో రూ.1.48కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

మార్కెటింగ్ శాఖ చీఫ్ ఇంజనీర్‌గా కోటయ్య నియామకం

విశాఖ మార్కెటింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న టి.రవిప్రసాద్‌ను గుంటూరులోని రాష్ట్ర కార్యాలయానికి అటాచ్ చేస్తూ, అతని స్థానంలో శ్రీకాకుళం జిల్లాలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.కోటయ్యను నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ పి.ప్రశాంతి ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంతోపాటు మార్కెటింగ్ శాఖ చేపడుతున్న గోదాముల నిర్మాణంలో సక్రమంగా పర్యవేక్షించకపోవడంతో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విధుల నుంచి తప్పిస్తూ గుంటూరులోని ప్రధాన కార్యాలయానికి పంపిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

'జగన్ ఈసారి బంగాళాఖాతంలోనే ప్రమాణస్వీకారం'

సీతంపేట, మార్చి 6: విజన్ విశాఖ పేరుతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి డ్రామాలు ఆడు తున్నారని, ఈసారి విశాఖలో కాకుండా బంగాళాఖాతంలో ఆయన ప్రమాణ స్వీకారం చేస్తారని జనసేన పార్టీ పీఏసీ సభ్యులు కోన తాతారావు ఎద్దేవా చేశారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ రాజధాని అంటూ ఇంకెన్నాళ్లు మోసం చేస్తారని నిలదీశారు. మూడు రాజధానుల పేరిట మూడు ముక్కలాటతో ప్రజల చెవిలో ఎన్నిసార్లు పూలు పెడతారని ప్రశ్నించారు. సమావేశంలో నార్త్ ఇన్‌చార్జి పసుపులేటి ఉషాకిరణ్, కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, గోవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

బీసీలకు భరోసా

... 5వ పేజీ తరువాయి

ప్రకటించడం వల్ల భవిష్యతులో జరిగే స్థానిక సంస్థల్లో ఎక్కువ మందికి పదవులు వస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. అలాగే 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్, అది కూడా నెలకు రూ.4 వేలు ఇస్తామని చెప్పడం పట్ల బీసీల్లో సంతోషం వ్యక్తమవుతోంది. గ్రామాల్లో వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు, నగరాలు, పట్టణాల్లో భవన నిర్మాణ కార్మికులు, రోజువారీ కూలీలు, కలాసీలకు పింఛన్ పథకం ఉపయుక్తంగా ఉంటుందని రొంగలి చినదేముడు అనే కలాసీ అన్నారు. అలాగే గతంలో బడ్జెట్‌లో బీసీ సబ్‌ప్లాన్‌కు ప్రత్యేకించి నిధులు ఖర్చుచేసేవారు. జనాభా దామాషా మేరకు నిధులు కేటాయింపు ఉండేది. ప్రధానంగా బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు, ఆయా వర్గాల సంక్షేమానికి పథకాలు, బీసీలు నివసించే చోట్ల మౌలిక సదుపాయాలకు సబ్ ప్లాన్ నిధులు వెచ్చించేవారు. గడచిన ఐదేళ్లుగా ఆ నిధులను జగన్ ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించిందని బీసీ వర్గాలు ఆందోళన చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన కూటమి ఐదేళ్లలో సబ్‌ప్లాన్‌కు రూ.1.5 లక్షల కోట్లు కేటాయిస్తామని చెప్పడాన్ని మూర్తి యాదవ్ అనే ప్రైవేటు ఉద్యోగి స్వాగతించారు. అదేవిధంగా ఇంటికి పెద్దదిక్కుగా ఉండే వ్యక్తులు ప్రమాదవశాత్తూ మరణిస్తే కుటుంబానికి అండగా ఉండేందుకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రన్న బీమా అమలుచేయగా, వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దాన్ని అటకెక్కించింది. దానివల్ల ఈ ఐదేళ్లలో అనేకమంది పేదవర్గాలు తీవ్రంగా నష్టపోయాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని చంద్రన్న బీమా పథకాన్ని రూ.10 లక్షలకు పెంచుతున్నట్టు డిక్లరేషన్‌లో ప్రకటించడం చాలా ప్రయోజనకరమనే చెప్పాలి. ఉమ్మడి ఏపీలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఆదరణ పథకం అమలుచేశారు. అదే పథకం టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తామని డిక్లరేషన్‌లో ప్రకటించారు. ఆదరణ పథకం కులవృత్తులకు మేలు చేస్తోందని రజక ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు రాజమండ్రి నారాయణ అభిప్రాయపడ్డారు. ఇంకా పీజీ విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్, విదేశీ విద్యా పథకం, శాశ్వత కుల ధ్రువీకరణ పత్రం మంజూరు వంటి వాటిపై బీసీ యువత హర్షం వ్యక్తంచేస్తోంది.

విద్యార్థులకు ఎంతో ప్రయోజనం



-బొడ్డేటి హేమంత్‌కుమార్, ఇంజనీరింగ్ విద్యార్థి, గోపాలపట్నం

టీడీపీ, జనసేన కూటమి బీసీ డిక్లరేషన్‌లోని పొందుపరిచిన శాశ్వత కుల ధ్రువీకరణ పత్రాలు జారీ, విదేశీ విద్య, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పునరుద్ధరణ వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఉన్నత విద్యాభ్యాసం కల సాకారమవుతుంది. మంచి విజన్ ఉన్న నేతగా గుర్తింపు ఉన్న చంద్రబాబు విద్యార్థుల ప్రయోజనం కోసం ఇటువంటి ఆలోచన చేయడం హర్షణీయం.

ఫీజు పరేషాన్

... 5వ పేజీ తరువాయి

పది వేలకుపైగా ఉంది. వీరందరికీ ప్రభుత్వం మూడు విడతల ఫీజులు చెల్లించాల్సి ఉంది. నగర పరిధిలోని ఓ ప్రముఖ కాలేజీలో ఏడాదికి ఫీజు రూ.67,700. ప్రభుత్వం నాలుగు విడతల్లో ఈ మొత్తాన్ని చెల్లిస్తుంది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి తొలి విడత మొత్తాన్ని సీఎం ఒకటో తేదీన విడుదల చేశాడు. ఈ మేరకు ఫైనల్ ఇయర్ చదువుతున్న ఒక విద్యార్థి, తల్లి ఉమ్మడి ఖాతాలో రెండు రోజుల కిందట రూ.16,925 జమ అయింది. ఈ మొత్తాన్ని చెల్లించేందుకు వెళ్లిన సదరు విద్యార్థికి...మిగిలిన మూడు విడతల ఫీజు కలిపి చెల్లించాలంటూ కాలేజీ యాజమాన్యం స్పష్టంచేసింది. లేదంటే హాల్ టికెట్ ఇచ్చేది లేదని తేల్చిచెప్పింది. చేసేదేమీ లేక మొత్తం ఫీజు చెల్లించాడు. ఇలా...ఒక్కో విద్యార్థిపై కాలేజీని బట్టి కనీసం రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు భారం పడనున్నది. ఎన్నికల తరువాత పరిస్థితి ఎలా ఉంటుందోననే విద్యార్థుల నుంచి ఫీజులు రాబట్టుకునేందుకు కళాశాలలు ప్రయత్ని స్తున్నట్టున్నాయి.

నేడు సీఎం జగన్ రాక

... 5వ పేజీ తరువాయి

చేరుకుంటారు. 10.50 గంటలకు బస్సులో బయలుదేరి పిసినికాడలో ఏర్పాటుచేసిన బహిరంగ సభా వేదిక వద్దకు వెళతారు. కలెక్టరు రవి పట్టన్‌శెట్టి అధ్యక్షతన ఏర్పాటుచేసిన 'చేయూత' నిధుల విడుదల కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడతారు. అనంతరం బటన్ నొక్కి నిధులు విడుదల చేస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు వైసీపీ నాయకులతో సమావేశమవుతారు. 2.10 గంటలకు హెలికాప్టర్‌లో విశాఖపట్నం విమానాశ్రయానికి బయలుదేరతారు. అక్కడి నుంచి 2.30 గంటలకు విమానంలో విజయవాడ బయలుదేరతారు.

వైసీపీ నేతల గ్రావెల్ దందా

... 5వ పేజీ తరువాయి

గండిగుండం, రామవరం తదితరచోట్ల గ్రావెల్‌ను అధికార పార్టీ నేతలు తవ్వుకుపోతున్నారు. ఆనందపురం మండల తహసీల్దారు కార్యాలయ అధికారులు, సిబ్బంది కూడా అధికార పార్టీ నేతల ఆదేశాల మేరకు పనిచేయడం తప్ప ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన తహసీల్దార్లు పూర్తిగా అధికార పార్టీ నేతల మాట మేరకు పనిచేశారని, ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురైనా పట్టించుకోలేదని, కొత్తగా వచ్చిన అధికారి కేవలం ఎన్నికల విధులు మినహా కూడా మరో విషయం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారంటున్నారు. కాగా పెందుర్తి మండలంలో కూడా పలుచోట్ల వైసీపీ నేతలు కొండలను తవ్వుకుంటున్నారు. పలుమార్లు గనుల శాఖ దాడులు చేసి జరిమానా విధించినా లెక్క చేయడం లేదు. చివరకు గనుల శాఖ అధికారులకు కొందరు వైసీపీ నేతలు ఫోన్ చేసి గ్రావెల్ లారీలు తమవేనని, వాటి జోలికి వెళ్లవద్దని హెచ్చరిస్తున్నారు. దీంతో ఎందుకొచ్చినా చిక్కు అంటూ గనుల శాఖ అధికారులు చూసీచూడనట్టు ఊరుకుంటున్నారు. పెందుర్తి మండలంలో జర్రిపోతులపాలెం, ఎస్.ఆర్.పురం, గుర్రంపాలెం, నరవ, తదితరచోట్ల రూ.కోట్ల విలువైన గ్రావెల్ అమ్ముకున్నారు.

తిరుమల, షిర్డీ రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

ఏడాది పొడవునా డిమాండ్ ఉంటుంది. విశాఖ నుంచి నేరుగా సాయినగర్ షిర్డీ స్టేషన్‌కు వెళ్లే ఏకైక రైలు ఇదొక్కటే కావడంతో డిమాండ్ అధికంగా ఉంటోంది.

ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు మేలో డిమాండ్

ప్రతి ఆదివారం వయా రాయగడ, రాయపూర్ మీదుగా మన్మాడ్ వెళ్లే విశాఖ-లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు (22847) సాధారణ డిమాండ్ నెలకొంది. షిర్డీ ఎక్స్‌ప్రెస్‌కు (18503) ప్రత్యామ్నాయంగా నిలిచిన ఎల్‌టీటీ (22847) ఎక్స్‌ప్రెస్‌కు మార్చిలో బెర్తులు నిండిపోగా ఏప్రిల్‌లో ఉన్నాయి. ఈ రైలు మన్మాడ్ వరకు వెళుతుంది. షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లో టికెట్ లభించనివారు ఈ రైలును ఆశ్రయించడంతో మే వరకూ బెర్తులు నిండిపోయాయి.

షిర్డీ ఎక్స్‌ప్రెస్ ఫ్రీక్వెన్సీ పెంపుపై వినతులు

షిర్డీ ఎక్స్‌ప్రెస్ ఫ్రీక్వెన్సీ పెంచాలన్న ప్రయాణికుల డిమాండ్‌పై రైల్వే అధికారులు దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. దాదాపు 16 ఏళ్ల క్రితం ప్రవేశపెట్టిన ఈ రైలు పట్టాలెక్కిన తొలిరోజు నుంచే ఆక్యుపెన్సీ తగ్గకుండా రాకపోకలు సాగిస్తోంది. వారానికి ఒకరోజు మాత్రమే అందుబాటులో ఉండడంతో షిర్డీ భక్తుల అవసరాలు తీరడం లేదని, కనీసం వారానికి రెండు రోజులైనా (బై వీక్లీ) నడిచే విధంగా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయమై ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టిసారించి రైల్వే అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నారు.

రూ.54.4 కోట్లతో సింహగిరి అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

కాంప్లెక్స్, రూ.81 లక్షలతో కూరగాయల నిల్వకు కోల్డ్ స్టోరేజీ, 14 సీట్ల ఎలక్ట్రిక్ బస్సులు ఆరు, లగేజీ స్క్రీనింగ్ సిస్టమ్, సెక్యూరిటీకి కావలసిన మెటల్ డోర్ ఫ్రేమ్స్, డిటెక్టర్లు, మల్టీ మీడియా సెంటర్, తదితర పలు పనులను చేపట్టనున్నారు.

బోధనోపకరణాలు ప్రదర్శన

తగరపువలస, మార్చి 6 : బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో డైట్‌లో శిక్షణ పొందుతున్న ఛాత్రోపాధ్యాయులు బుధవారం బోధనోపకరణాలను ప్రదర్శించారు. పలు పాఠ్యాంశాలకు సంబంధించి తయారు చేసిన వివిధ వస్తువుల చార్టులను ప్రదర్శనగా ఏర్పాటు చేసి,వాటి గురించి విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అప్పలరాజు, ఛాత్రోపాధ్యాయులు శ్రీను, జ్యోతి, శ్రీజ, హైమ, యామిని, తదితరులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణకు ప్రయత్నం

తగరపువలస, మార్చి 6 : తగరపువలసలో వానపల్లి సింహాచలంకు చెందిన 16 సెంట్ల స్థలాన్ని ఆక్రమించేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని ఉత్తరాంధ్ర మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు చిల్ల వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సింహాచలం ముగ్గురు కొడుకులు ఆర్మీలో పనిచేస్తున్నారని, అతనికి చెందిన 16 సెంట్ల స్థలంలో కంచె వేసుకుని జీవీఎంసీకి పన్ను చెల్లిస్తున్నారని చెప్పారు. ఇటీవల కొంతమంది కబ్జాదారులు ఆ స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నాలు చేసి కంచె తొలగించారని ఆరోపించారు. ఆక్రమణదారుల నుంచి స్థలాన్ని కాపాడాలని కోరారు.ఈవిషయమై భీమిలి పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఆరిలోవ, మార్చి 6 : విమ్స్‌లో ప్లాస్టిక్ సర్జరీకి సంబంధించి బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో కొత్తగా ప్లాస్టిక్ సర్జరీ విభాగాలను ప్రారంభించామని, వాటి గురించి ప్రజలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో వైద్య శిబిరం నిర్వహించామని చెప్పారు. అనంతరం వైద్యులు రోగులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. అలాగే 35 మందికి కలర్ డాప్లర్ పరీక్షలు, 21 మందికి రక్త పరీక్షలు చేశారు. కలెక్టర్ మల్లికార్జున ఈ శిబిరాన్ని సందర్శించారు.

నేడు, రేపు వైద్య శిబిరాలు

ఆరిలోవ, మార్చి 6 : చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం ఆవరణలో ఎన్టీఆర్ సేవా సమితి, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సేవా స్ఫూర్తి వ్యవస్థాపక అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ జరిగే ఈ శిబిరంలో వైద్యులు అన్ని రకాల వ్యాధులకు పరీక్షలు చేస్తారని చెప్పారు. అలాగే శివరాత్రి సందర్భంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 వరకు మెడికవర్ వైద్యులతో నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం ఆవరణలో ఉచిత వైద్య శిబిరం జరగనుంది.

175 మందికి వైద్య పరీక్షలు

పద్మనాభం (రూరల్), మార్చి 6 : పొట్నూరులో ఎన్టీఆర్ సేవా సమితి, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు సంయుక్తంగా బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గీతం వైద్యులు 175 మందికి పరీక్షలు చేసి, మందులు అందించారు. 30 మందిని మెరుగైన వైద్యం కోసం గీతం ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో టీడీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ రమణ, నాయకులు కాళ్ల నగేష్‌కుమార్, కె. దామోదరరావు, ఎం. నందీశ్వరరావు, ఆర్. సూర్యనారాయణ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

మద్దిలపాలెం, మార్చి 6 : శివాజీపార్కు రోడ్డులో వరసిద్ధి వినాయక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాసరావు, పీతల శ్రీనివాసరావు, ఉమాశంకర్, దువ్వి రాజశేఖర్, పెనల శ్రీను, సత్యం పాల్గొన్నారు.

మారికివలసలో ఫ్లాగ్‌మార్చ్

మధురవాడ, మార్చి 6 : ఎన్నికల నేపథ్యంలో మధురవాడ పరిసర ప్రాంతాల్లో పీఎంపాలెం పోలీసులు బుధవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సీఐ వై. రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు కాలనీల్లో మూలమూలన ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. మారికివలస రాజీవ్ గృహకల్ప కాలనీలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

సినిమా గైడ్

- **చారి 111 :** వెంకటేశ్వర-2, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మినీ మోహిని (గాజువాక).
- **భూతద్దం భాస్కరనారాయణ :** శారద, శరత్, ఊర్వశి (కంచరపాలెం) సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి).
- **ఇంటి నెం.13 :** లీలామహల్.
- **మా ఊరి రాజారెడ్డి :** క్రాంతి
- **రాధా మాధవం :** మౌర్య (గోపాలపట్నం)
- **భ్రమయుగం :** జగదాంబ, హెవెన్ (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **సుందరం మాస్టర్ :** శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సప్తగిరి (తగరపువలస)
- **సిద్దార్థ్ రాయ్ :** శ్రీరామ, శ్రీకన్య, మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **ఊరు పేరు భైరవకోన :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్ ఊర్వశి, నరసింహ (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)
- **ఈగల్ :** రమాదేవి,
- **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం), రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25,టమాటా 17, వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 30, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 44, బీరకాయలు 40, ఆనపకాయలు 15, కాలీఫ్లవర్ 24, క్యాబేజ్ 22, క్యారెట్ 24, దొండకాయలు 24, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 55, అల్లం (పాతది) 110, బరబటి 15, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 32, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 150, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 44, ఆగాకర 52, పొటల్స్ 62, కీరదోస 30, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 52, చిలగడదుంపలు 24 , కంద 64, దేముడు చిక్కుడు 56, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	-- 112
ఫారం ధర	-- 132
విత్ స్కిన్	-- 234
స్కిన్‌లెస్	-- 244

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



రామ్‌నగర్ : స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి



ఉషోదయ ప్రాంతంలో ప్రచారం చేస్తున్న పట్టాభిరామ్, నాయకులు

'సూపర్ సిక్స్'తో పేదలకు ఎన్నో ప్రయోజనాలు

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

రామ్‌నగర్, మార్చి 6 : జీవీఎంసీ 28వ వార్డు భానోజీనగర్, శబరినగర్‌లో టీడీపీ నాయకులు బుధవారం భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి నక్కా కనకరాజు, సురేశ్, అప్పలరాజు, కె. శివకృష్ణ, సత్యన్నారాయణ, పైడిరాజు, మహేశ్, సూర్యారావు, కనకమహాలక్ష్మి, డిల్లీశ్వరి పాల్గొన్నారు.

ఉషోదయ పరిసరాల్లో..

పెదవాల్తేరు : టీడీపీ అధినేత చంద్ర బాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల వల్ల పేదలకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చొడే వెంకట పట్టా భిరామ్ అన్నారు. తూర్పులోని ఉషోదయ పరిసర ప్రాంతాల్లో నాయకులు ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సత్తిబాబు, పీసీబీ రావు, పూసపాటి రాజు, బైరెడ్డి పోతన్నరెడ్డి, నరేంద్ర, వాసు పాల్గొన్నారు.

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో నాయకులు సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, నాయకులు వేజెళ్ల సుబ్బరాజు, అన్నె రాజా, గొలగాని వెంకన్న, వెంపాడ శ్రీనివాసరెడ్డి, షైలపల్లి శ్రీను, గరికిన నూకరాజు, శ్రీను, సబ్బి శివ, చెన్నా శంకర్, దబ్బి వెంకట్రావు, కొల్లేటి అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీల అభ్యున్నతి

భీమునిపట్నం : టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీల అభ్యున్నతి జరిగిందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు అన్నారు. చిన్నబజారులోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావంతోనే బీసీల్లో రాజకీయ చైతన్యంతో పాటు చట్టసభల్లో స్థానం లభించిందన్నారు. వైసీపీ బీసీలను కులాల వారీగా విభజించి కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు తప్ప కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. టీడీపీ పాలనలో బీసీలకు పలు రాయితీ రుణాలు ఇవ్వడంతో పాటు జీవనోపాధి మెరుగుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు నరేంద్రకుమార్, రాము, సదానంద, సంజీవ్, అప్పలనాయుడు, కామేష్ ఉన్నారు.

భూ ఆక్రమణలపై ఫిర్యాదుల వెల్లువ

మద్దిలపాలెం, మార్చి 6 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని పోలీస్‌స్టేషన్లలో భూ ఆక్రమణలపై బుధవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. మద్దిలపాలెంలోని మూడో పట్టణ స్టేషన్‌లో నిర్వహించిన డ్రైవ్‌లో మూడు ఫిర్యాదులు అందాయి. భూ ఆక్రమణల పరిశీలన ప్రత్యేక అధికారి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ఎం. శ్రీనివాసరావు ఫిర్యాదుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. దసపల్లా హిల్స్‌లో 96 గజాల పట్టా స్థలాన్ని ఆక్రమించారని ఒకరు ఫిర్యాదు చేయగా,రామా టాకీస్ రోడ్డులో అద్దెకు తీసుకున్న దుకాణాలను ఖాళీ చేయడం లేదని ఒకరు, పిఠాపురం కాలనీలో తనకు చెందిన 500 గజాల స్థలంలో బంధువులు ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారని మరొకరు ఫిర్యాదు చేశారు.



భీమిలి పోలీస్ స్టేషన్‌లో బాధితుల నుంచి వివరాలు నమోదు చేసుకుంటున్న సిబ్బంది



ఫిర్యాదు పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

ఎంవీపీ పరిధిలో ఆరు..

ఎంవీపీ కాలనీ : భూ ఆక్రమణలకు సంబంధించి ఎంవీపీ స్టేషన్ పరిధిలో ఆరు ఫిర్యాదులు వచ్చాయి. ఏసీపీ రాంబాబు ఆధ్వర్యంలో ఫిర్యాదులను స్వీకరించారు. ఇందులో రెండు కేసులు సదరు స్థలాలకు సంబంధించి ఇరువైపులా భూమి పత్రాలు ఉన్నట్టు గమనించారు. మిగిలిన వాటిలో సరిహద్దులు, గోడ ఆక్రమణలు వంటివి ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

భీమునిపట్నం : పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో 24 ఫిర్యాదులు అందాయి.డీసీపీ -1 మణికంఠ చందోలు ఫిర్యాదులు స్వీకరించారు. కుమ్మరిపాలెంలో వలంద భూములు, నమ్మివానిపేట, తాటితూరులో కుటుంబ తగాదా లపై పిటిషన్లు వచ్చాయి.

ఆనందపురం/పద్మనాభం : ఆనందపురం స్టేషన్‌లో స్పెషల్ బ్రాంచి ఏడీసీపీ వెంకట్రావు 13 ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో సీఐ తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు. పద్మనాభంలో మధురవాడ జోన్ ఏసీపీ సునీల్ ఐదు ఫిర్యాదులు స్వీకరించారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యనారాయణ, తదితరులు

నృసింహ మహాయజ్ఞం పోస్టర్ ఆవిష్కరణ

సింహాచలం, మార్చి 6 : సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి సింహగిరిపై జరగనున్న సుదర్శన నారసింహ మహాయజ్ఞం పోస్టర్, ఆహ్వాన పత్రికలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఆ శాఖ కమిషనర్ శ్రీరామ సత్యనారాయణ బుధవారం తాడేపల్లిగూడెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. అలాగే యజ్ఞంలో ఉభయదాతలు పాల్గొనేందుకు ముద్రించిన రూ. 3 వేల టికెట్లను కూడా మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అప్పన్న ఆలయ పురోహితులు కరి సీతారామాచార్యులు, డీఈఈ డీవీఎస్ రామరాజు (హరి), తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి అనంతుని కల్యాణోత్సవాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

పద్మనాభం, మార్చి 6 : పద్మనాభంలో ఈనెల 21 నుంచి జరిగే అనంత పద్మనాభుని కల్యాణోత్సవాల పోస్టర్లను స్థానిక కుంతీమాధవస్వామి ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు బుధవారం ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా 21న కల్యాణోత్సవం, 23న తెప్పోత్సవం, 24న రథోత్సవం, 25న డోలోత్సవం, 26న పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, ఎంపీపీ రాంబాబు, వైసీపీ భీమిలి ఇన్‌ఛార్జి, వైసీపీ మం డల అధ్యక్షుడు లక్ష్మణరావు, భీమిలి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జీపీవై నాయుడు, నాయకులు పద్దు, సత్యనారాయణ, చిన్నారావు, నారాయణరావు, అప్పలరాజు, నగేష్‌కుమార్, సత్యనారాయణ, ఆలయ అర్చకులు సీతారామాంజనేయస్వామి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



యూజీడీ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మేయర్, ఎంపీ

వెంకోజీపాలెం, మార్చి 6 : నగర ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా భూగర్భ మురుగు నీటి పైపులైన్ ఏర్పాటు చేస్తున్నామని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. బుధవారం ఆమె 15వ వార్డులోని జేఆర్‌నగర్, వెంకోజీపాలెం, ఉమానగర్, దుర్గానగర్ ప్రాంతాల్లో భూగర్భ మురుగు నీటి పైపులైన్ల మార్పు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. 58. 10 లక్షలతో ఈ పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ సత్యనారాయణ, కార్పొరేటర్ శ్రీవిద్య, నాయకులు గిరిబాబు, పీల వెంకట పరదేశినాయుడు పాల్గొన్నారు.

ఆరిలోవ : జీవీఎంసీ 12వ వార్డులో పలు అభివృద్ధి పనులకు మేయర్ హరి వెంకట కుమారి, ఎంపీ సత్యన్నారాయణ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది గంటల విద్యుత్ అందించాలని వినతి

పద్మనాభం (రూరల్), మార్చి 6 : తమకు తొమ్మిది గంటల పాటు విద్యుత్ అందించాలని రైతులు కోరుతున్నారు. ఈమేరకు బుధవారం వారు ఏఈకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం 9 గంటలు విద్యుత్ అందిస్తామని చెప్పి ఏడు గంటలే ఇస్తోందన్నారు.

'జాతీయ స్థాయిలో యూత్ ఫెస్ట్ నిర్వహిస్తాం'

వెంకోజీపాలెం, మార్చి 6 : ఏయూ వేదికగా ఆల్ ఇండియా యూనివర్సిటీ యూత్ ఫెస్ట్ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ వేదికగా జనవరిలో సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ యూత్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించిన అధికారులకు, విద్యార్థులకు వీసీ బుధవారం తన కార్యాలయంలో ప్రశంసాపత్రాలు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

శివరాత్రి జాతర ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష

వెంకోజీపాలెం, మార్చి 6 : నగరంలోని తీర ప్రాంతాల్లో శివరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో శివరాత్రి సందర్భంగా ప్రజలకు కల్పించే భద్రత, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలపై అదనపు కమిషనర్ విశ్వనాథన్‌తో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా నగరంలోని తీర ప్రాంతాల్లో స్నానాలు చేయడానికి లక్షలాది మంది భక్తులు వస్తారని, వారికి భద్రతా ఏర్పాట్లతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

అసంగానంద ఆశ్రమంలో శివరాత్రి ఉత్సవాలు రేపు

పెదవాల్తేరు, మార్చి 6 : పెదవాల్తేరులోని అసంగానందాశ్రమంలో శుక్రవారం శివరాత్రి ఉత్సవాలు నిర్వహించను న్నట్టు ఆశ్రమ ఉపాధ్యక్షుడు మద్ది శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఆశ్రమంలో ఉత్సవాలకు సంబంధి చిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేకువజామున నుంచి స్వామివారికి పంచామృతాభిషేకాలు, సాయంత్రం ఉత్సవ విగ్రహం ఊరేగింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ ఉపాధ్యక్షుడు విశ్వేశ్వరరావు, కార్యదర్శి అప్పారావు, నారాయణమ్మ పాల్గొన్నారు.

పీఎం పాలెం ఆలయంలో పూజలు...

మధురవాడ : పీఎం పాలెంలోని హౌసింగ్ బోర్డు కాలనీ ఆఖరి బస్టాపు సమీపంలో ఉన్న షిర్డీ పద్మసాయి ఆలయ ఆవరణలో ఉన్న ఎండల మల్లేశ్వరస్వామికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేయనున్నారు. 108 శివలింగాలకు ఉదయం 5 నుంచి ఏకవార పంచామృతాభిషేకాలు, రాత్రి 9 గంటలకు సామూహిక రుద్రాభిషేకాలు జరగనున్నాయి. అలాగే షిర్డీసాయికి 20 కిలోల వెన్నతో అభిషేకం చేయనున్నారు.

ఘనంగా విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

ఆరిలోవ, మార్చి 6 : పెదగదిలిలోని కాశీ అన్నపూర్ణ సహిత విశ్వేశ్వరస్వామి ఆలయం 23వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ముందుగా అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. అనంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. మూడు వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి పోలారావు, అప్పలరాజు, ఎంపీ ఎంవీవీ సత్యన్నారాయణ. గొలగాని శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

విలాస్కాన్‌పాలెంలో...

పద్మనాభం : విలాస్కాన్‌పాలెంలో స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఏటా మాఘ మాసం బహుళ ఏకాదశి నాడు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం చేయడం ఆనవాయితీ. ఈమేరకు మధ్యాహ్నం మృత్తిక (పుట్టమన్ను) సేకరించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పల్లకీపై ఊరేగించి, ఆలయంలో వేదికపైకి తీసుకువచ్చి నిలిపారు. వేదపండితుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

ఆశయం దిశగా అడుగులు వేయండి : వీసీ

వెంకోజీపాలెం, మార్చి 6 : యువత ఆశయం దిశగా అడుగులు వేయాలని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి సూచించారు. బుధవారం టీఎల్ఎన్ సభా మందిరంలో నిర్వహించిన జియో ఫిజిక్స్ విభాగం వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. వర్సిటీలో విద్య సంబంధిత వాతావరణాన్ని పూర్తిస్థాయిలో మార్పు చేశామని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని చెప్పారు. కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ డీన్ శ్రీకృష్ణ, విభాగాధిపతి ఆచార్య సి.వి. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏయూతో ఏపీ గ్రౌండ్ వాటర్ డిపార్టుమెంట్ ఎంఓయూ

ఏయూతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గ్రౌండ్ వాటర్-వాటర్ ఆడిట్ విభాగం అవగాహన ఒప్పందం చేసుకుంది.బుధవారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో అవగాహన ఒప్పందంపై వీసీ ప్రసాదరెడ్డి సమక్షంలో రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేసారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యత

సిరిపురం, మార్చి 6 : విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు ఆంధ్ర రాష్ట్ర సమితి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు చెప్పారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజా ఎదుగుదల యాత్రలో భాగంగా విశాఖకు వచ్చానన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే డ్వాక్రా మహిళలకు వెయ్యి గజాల స్థలం ఉచితంగా ఇస్తామని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను విడతలవారీగా ముఖ్యమంత్రిగా చేస్తామన్నారు.



తాటితూరులో సర్వేకు వచ్చిన బృందంతో ఉపాధ్యాయులు

తాటితూరులో ఎన్‌సీఈఆర్‌టీ బృందం సర్వే

భీమునిపట్నం (రూరల్), మార్చి 6 : న్యూఢిల్లీకి చెందిన నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) బృందం బుధవారం తాటితూరు ప్రాథమిక పాఠశాలను సందర్శించింది. పాఠశాలలో వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల రక్షణకు తీసుకుంటున్న చర్యలు, మరుగుదొడ్ల నిర్వహణ తదితర ఇరవై అంశాలకు సంబంధించి పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి, వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీఈఆర్‌టీకి చెందిన దిలీప్‌వర్మ, డా. శిల్పామనోజ్ఞ, నిఖిత శర్మ, భీమిలి డైట్ లెక్చరర్ సోమయాజులు, ఎంఈఓ జయప్రద, సర్వశిక్ష అభియాన్‌కు చెందిన నీలిమ, పాఠశాల హెచ్‌ఎం సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : పెద్ద రుషికొండలోని ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను కూడా ఎన్‌సీఈఆర్‌టీ బృందం సందర్శించింది. కార్యక్రమంలో ఎంఈఓ అనురాధ, హెచ్‌ఎం పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవం

సాగర్‌నగర్, మార్చి 6 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమనిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌కు అనుబంధంగా ఉన్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ అండ్ పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధనోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు, సంగీత కళా సాగర అవార్డు గ్రహీత ముట్నూరి జయలక్ష్మి ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత లలిత కళలను నేర్చుకోవడం వల్ల జీవితాన్ని ఉన్నతంగా మలుచుకోవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ బండి కామయ్య, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ అండ్ ఫెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ అధిపతి డాక్టర్ అముక్త మాల్యద, గీతం విద్యా సంస్థల అధ్యక్షుడు శ్రీభరత్, తదితరులు పాల్గొన్నారు.

'నగరాల సంఘం భవన నిర్మాణానికి స్థలం ఇవ్వాలి'

మధురవాడ, మార్చి 6 : నగరంలో నగరాల సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి ఎకరా స్థలం కేటాయించాలని నగరాల కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు కోరారు. బుధవారం 6వ వార్డు బక్కన్నపాలెంలో నగరాల సామాజికవర్గం రాష్ట్రస్థాయి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాలను బీసీ డి నుంచి ఏకు మార్చాలన్నారు. భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి, కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక, విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి నరేంద్ర, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్లు, రాష్ట్ర సంఘం అధ్యక్షుడు బాయన బాబ్జీ, పోతిన శ్రీను, పోతిన హనుమంతరావు, పిళ్లా సూరిబాబు, మరుపిళ్ల పైడిరాజు, పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, పలు జిల్లాల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళలు మానసికంగా బలంగా ఉండాలి



మాట్లాడుతున్న గీతం అధ్యక్షుడు శ్రీభరత్

సాగర్‌నగర్, మార్చి 6 : మహిళలు మానసిక బలం కలిగి ఉన్నప్పుడే ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొగలరని గీతం విద్యా సంస్థల చైర్మన్ ఎం. శ్రీభరత్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గీతం యూనివర్సిటీలోని మహిళా సాధికారి విభాగం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన హెల్త్ వాక్‌లో ఆయన మాట్లాడారు. ఒక్క శారీరక దృఢత్వం మినహా మహిళలు పురుషులతో అన్ని రంగాల్లోనూ సమానంగా వున్నారని చెప్పారు. అంతరిక్షం నుంచి వాణిజ్య రంగం వరకు ప్రతిభను చాటుతున్న మహిళలను విద్యార్థినులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అంతకుముందు మహిళా అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసి గీతం ఆవరణలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో గీతం విద్యా సంస్థల కార్యదర్శి భరద్వాజ, జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి, గీతం మహిళా సాధికారిక విభాగం ఛైర్‌పర్సన్ డాక్టర్ వీబీ శ్రీవిద్య, స్టూడెంట్ లైఫ్ డీన్ డాక్టర్ బాలాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు స్వర్ణ తులసీ దళార్చన

సింహాచలం, మార్చి 6 : వరాహలక్ష్మీనృసింహస్వామికి స్వర్ణ తులసీ దళార్చన బుధవారం వైభవంగా నిర్వహించారు. మాఘమాస బహుళపక్ష ఏకాదశి పురస్కరించుకుని వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణం వైభవంగా జరిపారు.

ఉన్నత విద్యతోనే మహిళా సాధికారత

వెంకోజీపాలెం : మహిళా సాధికారతకు ఉన్నత విద్యే ప్రధానమని ఏయూ లా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి. విజయలక్ష్మి అన్నారు. బుధవారం వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ఉమెన్స్ స్టడీస్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గైనాకాలజిస్టు డాక్టర్ సుధా పద్మశ్రీ, లీ ఫార్మా వైస్ చైర్ డాక్టర్ లీలారాణి, దామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ప్రొఫెసర్ నందినీ పాల్గొన్నారు.

భీమునిపట్నం:మహిళా సాధికారతతోనే దేశ అభివృద్ధి సాధ్యమని విశాఖ కేన్సర్ ఆస్పత్రి అండ్ రీసెర్చి ఇనిస్టిట్యూట్ చీఫ్ రేడియాలజిస్టు డాక్టర్ పి. మాధురి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. స్త్రీల్లో వస్తున్న సర్వేకల్ కేన్సర్‌కు వ్యాక్సిన్ వుందని, కళాశాలలో వ్యాక్సిన్ డ్రైవ్ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ మంజుల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, అధ్యాపకులు బి. సహదేవుడు, డి. మాధురి, పాల్గొన్నారు.

